Visakha Samacharam
MINI
FUNCTION HALL
100 Seating
Call : 93939 49345

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

హారిక, హాసిని
కేటరింగ్ & కుకింగ్
బ్రాహ్మణ భోజనాలు
అతి తక్కువ ధరలకే లభించును
All Function Catering (Veg) Order Taken
ప్రొప్రైటర్ : సంతోష్ కుమార్
Ph : 8985488221
9014911305
పెదగదిలి, సింహాగిరి కోలని, విశాఖపట్నం

RNI No.52722/90 సంపుటి : 34 సంచిక : 198 విశాఖపట్నం, 19 మే 2024 ఆదివారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

## స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట భద్రతా ప్రమాణాలు పాటించాలి



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద అన్ని రకాల భద్రతా ప్రమాణాలు పాటించాలని, పటిష్ట చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా పేర్కొన్నారు. అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్త వహించాలని జిల్లా అధికారులకు సూచించారు. ఏయూ ఇంజనీరింగ్ కళాశాల పరిధిలో ఏర్పాటు చేసిన ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. ఎ. మల్లికార్జున, పోలీసు కమిషనర్ డా. ఎ. రవిశంకర్ తో కలిసి శనివారం ఉదయం ఆయన పరిశీలించారు. విశాఖపట్టణం పార్లమెంటుతో పాటు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన స్ట్రాంగ్ రూమ్‌లను తనిఖీ చేశారు. అక్కడ పరిస్థితులను గమనించారు. తలుపులకు వేసిన తాళాలను, వాటికున్న సీళ్లను సునిశితంగా పరిశీలించారు. అన్ని చోట్లా సీసీ కెమెరాలు ఉన్నాయా లేదా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకున్నారా లేదా అనే అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. తనిఖీ అనంతరం లాగ్ బుక్లో సంతకం చేశారు. మూడెంచల భద్రతను పాటించాలని, ఇక్కడి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్‌కు సూచించారు. అనధికార వ్యక్తులను స్ట్రాంగ్

(మిగతా 2లో)

## కేరళలో పెరుగుతున్న హెపటైటిస్ కేసులు

### ఇప్పటికే 12 మంది మృతి




కేరళలో హెపటైటిస్ ఏ విజృంభిస్తోంది.. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే దీనిబారిన పడ్డవారి సంఖ్య 2 వేలు దాటింది. ఇప్పటి వరకు హెపటైటిస్‌తో మొత్తం 12 మంది చనిపోయారని వైద్యారోగ్య శాఖ తెలిపింది. మలప్పురం, ఎర్నాకులం, కోజికోడ్, త్రిసూర్‌లలో ఈ కేసులు పెరుగుతున్నాయి. కేసులు రోజురోజుకూ పెరుగుతుండడంతో ప్రభుత్వం అలర్ట్ ప్రకటించింది. కలుషిత ఆహారం, కలుషిత నీటి ద్వారా వ్యాప్తి చెందే హెపటైటిస్ ఏ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలతో మార్గదర్శకాలు విడుదల చేసింది. ఆసుపత్రులలో మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలంటూ వైద్యారోగ్య సిబ్బందికి సూచించింది.

**హెపటైటిస్ ఏ అంటే..**

వైద్య నిపుణులు చెబుతున్న వివరాల ప్రకారం.. కలుషిత నీరు, కలుషిత ఆహారం తీసుకోవడం వల్ల హెపటైటిస్ ఏ బారిన పడే ప్రమాదం ఉంది. ఈ వైరస్ కాలేయంపై ప్రభావం చూపిస్తుంది. సకాలంలో చికిత్స అందకపోతే కామెర్లకు దారితీస్తుంది. ఇన్ ఫెక్షన్ ముదిరి కాలేయ వైఫల్యానికి కారణమవుతుందని చెప్పారు. ఆ సందర్భంలో కాలేయ మార్పిడి అవసరమవుతుందని వివరించారు. కొంతమంది బాధితుల్లో హెపటైటిస్ లక్షణాలు పెద్దగా కనిపించవని, వేగంగా కోలుకుంటారని డాక్టర్లు చెప్పారు. మరి కొంతమందిలో మాత్రం వ్యాధి తీవ్రమై మరణం సంభవిస్తుందని తెలిపారు.

**ఒకరి నుంచి మరొకరికి..**

హెపటైటిస్ ఏ బాధితులతో సన్నిహితంగా ఉన్న వారికి కూడా వ్యాధి సోకుతుందని వైద్యనిపుణులు చెబుతున్నారు. ఈ వ్యాధి సోకిన వ్యక్తితో శారీరక సంబంధం ద్వారా హెపటైటిస్ ఏ వచ్చే అవకాశం ఎక్కువన్నారు. రక్త మార్పిడి ద్వారా, గర్భిణి నుంచి పుట్టబోయే పిల్లలకు సంక్రమిస్తుందని చెప్పారు. కాలేయ సంబంధిత అనారోగ్యంతో బాధపడుతున్న వారితో పాటు మద్యపానం అలవాటు ఉన్న వారికి హెపటైటిస్ ఏ తో ముప్పు ఎక్కువని వైద్యులు

(మిగతా 2లో)

## ఈ విజయం తొలి అడుగు మాత్రమే : షర్మిల



వివేకా హత్య కేసుపై మాట్లాడవద్దంటూ కడప కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను ఏపీ పీసీసీ చీఫ్ షర్మిల సుప్రీంకోర్టులో సవాల్ చేసిన సంగతి తెలిసిందే. షర్మిలకు ఊరటనిస్తూ... కడప కోర్టు ఉత్తర్వులపై సుప్రీంకోర్టు స్టే విధించింది. పూర్తి వాదనలు వినకుండా ఒకరి వాక్ స్వాతంత్ర్యాన్ని, స్వేచ్ఛను ఎలా హరిస్తారని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.

సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో షర్మిల సోషల్ మీడియా వేదికగా స్పందించారు. దురాత్ముల నీచబుద్ధికి దిమ్మతిరిగేలా, మాడుపగిలేలా నిన్న వివేకానందరెడ్డి హత్య కేసులో సుప్రీంకోర్టు స్టే

(మిగతా 2లో)


## దేశంలో పలు రాష్ట్రాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఎండలు మండిపోతున్నాయి. పలు రాష్ట్రాలకు భారత వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఢిల్లీలోని నజాగఢ్‌లో శనివారం 47 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఇదే దేశంలో అత్యంత హాటెస్ట్ ప్రదేశంగా నజాగఢ్ ఉందని ఐఎండి పేర్కొంది. మే 17 నుంచి 21 వరకు దేశంలో పలు రాష్ట్రాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండి అంచనా వేసింది.

కాగా, శుక్రవారం రాజస్థాన్‌లోని బార్మర్‌లో 46.5 డిగ్రీల సెల్సియస్, ఢిల్లీలోని

(మిగతా 2లో)




## బాబు ప్రమాణ స్వీకారానికి గంటా, జగన్ ప్రమాణోత్సవానికి బొత్స

## ఉత్తరాంధ్రలో వింత ఆహ్వానాలు..!



ఇటీవల ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీతోపాటు లోక్‌సభ ఎన్నికలు ముగిశాయి. ఎవరికి అంతుచిక్కని ఎన్నికల ఫలితాల కోసం అందరం ఎదురుచూస్తున్న క్రమంలో ఉత్తరాంధ్ర లో ఒక ఆసక్తికర రాజకీయం సాగుతోంది. మా అధినేతనే ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారంటూ ఇద్దరు కీలక నేతలు సవాళ్లు విసురుతున్నారు. సవాల్ ప్రతి సవాల్‌తో పోలింగ్ ముగిశాక కూడా ఉత్తరాంధ్ర రాజకీయాలను మరింత హీట్ పెంచుతోంది.

ఆ ఇద్దరూ ఉత్తరాంధ్ర రాజకీయాల్లో ఉద్దండులే. ఒకప్పటి ఆప్త మిత్రులే. చాలా సారూప్యాలు కూడా ఇద్దరి మధ్య ఉన్నాయి. ఓకేసారి రాజకీయాల్లోకి వచ్చారు. తొలి ఎన్నికల్లోనే గెలిచి ఇద్దరూ ఒకేసారి పార్లమెంట్ లో అడుగుపెట్టారు. ఆ తర్వాత ఇద్దరూ ఉమ్మడి ఏపీ అసెంబ్లీ నుండి నేటి వరకు ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా పని చేశారు. ఇద్దరూ మిత్రులైనా తాజాగా రాజకీయ ప్రత్యార్థులుగానే కొనసాగుతున్నారు. పార్టీలు వేరైనా ఒకానొక టైమ్ లో మంత్రి వర్గంలో సహచరలుగా పని చేశారు. అయితే అదంతా గతం అంటూ శాశ్వత మిత్రులు, శత్రువులు ఇక్కడ ఉండబోరంటూ తాజాగా మరోసారి ఆధిపత్యం కోసం తలపడ్డారు.

మరికొద్ది రోజుల్లో ఎన్నికల ఫలితాలు రానున్న నేపథ్యంలో ఒకరు జూన్ 9న చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తారని స్టేట్‌మెంట్ ఇస్తుంటే, మరొకరు అదే జూన్ 9న విశాఖలో జగన్ సీఎంగా ప్రమాణస్వీకారం చేస్తారనీ కౌంటర్ ఇస్తున్నారు. మాజీ మంత్రి హోదాలో మీకు ఆహ్వానం ఉంటుంది. మీరు కూడా రావచ్చంటూ తన పాత మిత్రుడికి ముందస్తు ఆహ్వానం

(మిగతా 2లో)

## ఏపీలో భారీ వర్షాలు



ఏపీలోని పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. తాజాగా వాతావరణ శాఖ మరో అలర్ట్ జారీ చేసింది. నైరుతి రుతుపవనాలు నిర్దేశిత సమయం కంటే ముందుగానే ప్రవేశిస్తున్నాయి. ఈ నెల 19న రుతుపవనాలు ప్రవేశించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఇదే సమయంలో ఈ నెల 22న బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉంది. ఇక,రానున్న మూడు రోజుల పాటు ఏపీలోని పలు జిల్లాల్లో భారీ వర్షాల పై వాతావరణ శాఖ అలర్ట్ జారీ చేసింది.

రానున్న మూడు రోజుల్లో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముంది. భారీ వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.. బలమైన ఈదురు గాలులు(గంటకు 40-50 కిమీ వేగంతో) వీచే అవకాశం ఉందని పేర్కొంది. అదే విధంగా వచ్చే రెండు రోజల్లో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని వెల్లడించింది.

దక్షిణ కోస్తా ప్రాంతంలో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముందిని తెలిపింది. భారీ వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. రాయలసీమ జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని వెల్లడించింది. బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. ప్రధానంగా గోదావరి,కోస్తా, సీమ జిల్లాల్లో రానున్న మూడు రోజుల్లో మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఇక ఎండలు క్రమేణా తగ్గముఖం పడుతాయని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

మెగా బ్రాహ్మణ వివాహ వేదిక
తెలుగు బ్రాహ్మణ వధూవరుల
వివాహ పరిచయ కార్యక్రమం
విశాఖ సమాచారమ్ దినపత్రిక కార్యాలయం
9-3-16, పిఠాపురం కోలనీ, (కృష్ణా కాలేజ్ జంక్షన్, మెయిన్‌రోడ్డు) విశాఖపట్నం-530003



తేది : 26-05-2024, (ఆదివారం)
సమయం : మధ్యాహ్నం గం. 3.00 ల నుండి సాయంత్రం గం. 5.00 వరకు.
శ్రీకాకుళం నుండి విజయవాడ వరకు,
హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, చెన్నై,
బెంగుళూరు, పూణే వంటి ప్రముఖ
నగరాలలో పనిచేస్తున్న సుమారు
500 మంది వధూవరుల వివరములతో...
రిజిస్ట్రేషన్ మరియు వివరముల కొరకు
జనహిత మ్యాట్రిమోనీ
9393949345, 8074541283
Compli

## కౌంటింగ్ నేపథ్యంలో గ్రామస్తులంతా బాధ్యతగా ఉండాలి



**యలమంచిలి, (విశాఖ సమాచారమ్):** ఈ నెల 13వ తారీఖున జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాలు జూన్ 4న వెలువడనున్న నేపథ్యంలో ప్రతీ గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉంచే విషయమై శనివారం నాడు పరవాడ డీఎస్పీ కె.వి.సత్యనారాయణ యలమంచిలి మున్సిపాలిటీకి చెందిన సోమలింగపాలెం గ్రామస్తులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఫలితాలు వెలువడే సందర్భంలో గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గ్రామాన్ని సస్యశ్యామలంగా ఉంచుకోవాలని ప్రతీ ఒక్కరూ బాధ్యతాయుతంగా ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్సై సింహాచలం, సిబ్బంది పాల్గొన్నారు.

## శామ్‌కో మ్యుచువల్ ఫండ్ ద్వారా అద్భుతాలు

**ముంబై, (విశాఖ సమాచారమ్):** ప్రముఖ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్ సంస్థ అయిన శామ్‌కో అసెట్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ కొత్తగా స్పెషల్ ఆపర్చునిటీస్ ఫండ్‌ని ఆవిష్కరిస్తోంది. మార్కెట్లో అవకాశాలను గుర్తించి, అందిపుచ్చుకోవడం, ఉండాల్సిన దానికన్నా తక్కువ విలువ ఉన్న సాధనాలు లేదా అంతగా అందరికీ తెలియని అవకాశాలను అందిపుచ్చుకోవడం ద్వారా దీర్ఘకాలంలో పెట్టుబడిని పెంచే లక్ష్యంతో ఈ విశిష్టమైన ఫండ్ డిజైన్ చేయబడింది.

శామ్‌కో మ్యుచువల్ ఫండ్‌కి చెందిన స్పెషల్ ఆపర్చునిటీస్ ఫండ్ అనేది DISRUPTION అనే వ్యూహంతో రూపొందించబడింది. ఇందులో 10 విశిష్టమైన ఉప-వ్యూహాలు ఉన్నాయి. వీటిలో డిజిటైజేషన్, ఇన్‌సైడర్ మిర్రర్ ట్రేడింగ్, స్పిన్ ఆఫ్స్ & కార్పొరేట్ చర్యలు, రిఫార్మ్స్- (రెగ్యులేటరీ, గవర్నమెంట్), అండర్‌వేల్యూగా ఉన్న హోల్డింగ్ కంపెనీలు, ప్రీమియమైజేషన్, దీర్ఘకాలంలో సుస్థిరంగా ఉండే ట్రెండ్స్, ఇన్నోవేషన్ మరియు టెక్నలాజికల్ డిస్‌రప్షన్ (నవకల్పనలు, సాంకేతిక మార్పులు), ఆర్గనైజ్డ్ షిఫ్ట్ (సంఘటిత మార్పులు), న్యూ & ఎమర్జింగ్ సెక్టార్స్ (కొత్త, వర్ధమాన రంగాలు) ఉన్నాయి.

భావి వృద్ధి సాధన, ఇన్వెస్టర్లకు మరింత విలువను చేకూర్చే దిశగా కొత్త పెట్టుబడి ఐడియాలను రూపొందించేందుకు, విప్లవాత్మకమైన మార్పులు మరియు ప్రత్యేక పరిస్థితుల రూపంలో వచ్చే అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఈ మోడల్‌లోని 10 ఉప-వ్యూహాలు ఒక పద్ధతి ప్రకారం ముందుకెళ్లేందుకు తోడ్పడతాయి. సరళత్వం అనేది ఈ ఫండ్‌కి సంబంధించిన ప్రధాన ఫీచరు. వివిధ రంగాలు, థీమ్‌లవ్యాప్తంగా వర్ధమాన ట్రెండ్స్‌ను, ఎప్పటికప్పుడు మారిపోయే మార్కెట్ పరిస్థితులతో వచ్చే అవకాశాలను నిరాటంకంగా అందిపుచ్చుకునేందుకు ఇది ఉపకరిస్తుంది.

"అధునాతన, విశ్వసనీయమైన ఆర్థిక పరిష్కార మార్గాలు అందించడం ద్వారా ఇన్వెస్టర్లకు సాధికారత కల్పించాలనేది శామ్‌కో మ్యుచువల్ ఫండ్ లక్ష్యం. చురుగ్గా వ్యవహరిస్తూ, మారే పరిస్థితులకు అనుగుణంగా సత్వరం మారగలగడం అనేది శామ్‌కో స్పెషల్ ఆపర్చునిటీస్ ఫండ్ ప్రత్యేకతలు. పెట్టుబడుల ప్రపంచంలో వివిధ రంగాలు, థీమ్‌లవ్యాప్తంగా ఎప్పటికప్పుడు మారిపోయే పరిస్థితులను ఎదుర్కొంటూ సమర్థంగా ముందుకెళ్లగలిగే సరళత్వం మా ఫండ్ సొంతం" అని శామ్‌కో మ్యుచువల్ ఫండ్ సీఈవో శ్రీ విరాజ్ గాంధీ తెలిపారు.

శామ్‌కో ఎస్‌వోఎఫ్ పెట్టుబడుల పరిధి కేవలం నిర్దిష్ట మార్కెట్ క్యాపిటలైజేషన్ కంపెనీలకే పరిమితం కాకుండా విస్తృతమైనదిగా ఉంటుంది. ఈ వ్యూహం వల్ల లార్జ్-క్యాప్ నుంచి మైక్రో-క్యాప్ కంపెనీల వరకు విస్తృత మార్కెట్లోని ప్రత్యేక పరిస్థితులను అన్వేషించేందుకు, వాటి నుంచి ప్రయోజనాలను పొందేందుకు సాధ్యపడుతుంది. ఏదో ఒక నిర్దిష్ట సెగ్మెంట్‌కు మాత్రమే పరిమితం కాకపోవడం వల్ల ఈ ఫండ్, ఎప్పటికప్పుడు తలెత్తే విస్తృత పెట్టుబడుల అవకాశాలను అందిపుచ్చుకోగలుగుతుంది.


విశాఖ సమాచారమ్
ప్రతులకు, ప్రకటనలకు
సెల్: 9393949345, 8247526179


పంచాంగం

ఆదివారం 19-05-2024
క్రోధి నామ సంవత్సరము
ఉత్తరాయణం, వసంతరుతువు
వైశాఖమాసం

| | |
|---|---|
| తిథి | : బ. ఏకాదశి ప. 12.56 |
| నక్షత్రం | : హస్త రా. 02.47 |
| వర్జ్యం | : ఉ. 09.31 ల 11.17 |

## తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న సీఎం రమేష్



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** కలియుగ ప్రత్యక్ష దైవం, ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుమల తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామివారిని కుటుంబసమేతంగా నేడు అనకాపల్లి ఎం.పీ కూటమి అభ్యర్థి శ్రీ సీ.ఎం రమేష్ దర్శించుకున్నారు. ప్రజలందరిపై స్వామి వారి ఆశీస్సులు ఉండాలని, అనకాపల్లి జిల్లా ప్రజలకు సేవ చేసే శక్తిని అదృష్టన్నీ ప్రసాదించాలని స్వామివారిని వేడుకున్నాము తెలియజేసారు.

## (మొదటి పేజీ తరువాయిలు)

### స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట భద్రతా ప్రమాణాలు పాటించాలి

రూమ్ము ఉన్న ప్రాంతంలోకి ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించరాదని చెప్పారు. ఎలక్షన్ కమిషన్ నిబంధనల ప్రకారం అన్ని రకాల జాగ్రత్తలు వహించాలన్నారు. పర్యటనలో భాగంగా అక్కడి పరిస్థితులను, జిల్లా యంత్రాంగం తరపున చేపట్టిన చర్యలను సీఈవోకు కలెక్టర్, పోలీసు కమిషనర్ వివరించారు.

ఆయన వెంట జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.ఎ. మల్లికార్జున, పోలీసు కమిషనర్ డా. ఎ. రవిశంకర్, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, ఆయా నియోజకవర్గాల ఆర్వోలు, ఇతర అధికారులు ఉన్నారు.

### కేరళలో పెరుగుతున్న హెపటైటిస్ కేసులు

తెలిపారు.

**లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు..**

హెపటైటిస్ ఏ బాధితులలో అలసట, వికారం, వాంతులు, కడుపు నొప్పి, జ్వరం, చర్మం, కళ్లు పసుపు రంగులోకి మారడం వంటి లక్షణాలు కనిపిస్తాయని వివరించారు. రోడ్డు పక్కన అమ్మే చిరుతిళ్లకు దూరంగా ఉండడం, ఆహారం తీసుకోవడానికి ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవడం, నీటిని వేడి చేసి చల్లార్చి తాగడం వంటి జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా హైపటైటిస్ ఏ ను దూరం పెట్టొచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

### ఈ విజయం తొలి అడుగు మాత్రమే : షర్మిల

ఇచ్చిందని షర్మిల వెల్లడించారు. భావ ప్రకటన స్వేచ్ఛపై ఈ రాక్షస మూక చేయబోయిన దాడిని తిప్పికొట్టి ఎప్పటికైనా ధర్మపోరాటంలో న్యాయమే గెలుస్తుందని నిన్న నిరూపణ అయిందని పేర్కొన్నారు. అధికార బలాన్ని ఉపయోగించి మూర?త్వంతో ఇలాంటి చిల్లర కుట్రలు చేసే వారికి ఈ స్టే చెంపపెట్టు అని షర్మిల స్పష్టం చేశారు.

"ఈ విజయం తొలి అడుగు మాత్రమే. రాబోయే రోజుల్లో వివేకా కుటుంబానికి న్యాయం కోసం పోరాటం ఉధృతం చేస్తాం. చిట్టచివరిగా విజయం, నిజం, న్యాయం వైపే ఉంటాయని చూపిస్తాం" అని షర్మిల ఉద్ఘాటించారు.

### దేశంలో పలు రాష్ట్రాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు

అయానగర్‌లో 46.2 డిగ్రీలు, మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో 44.9 డిగ్రీలు, గుజరాత్‌లోని సురేంద్రనగర్‌లో 44.7 డిగ్రీల సెల్సియస్, పంజాబ్‌లోని పాటియాలలో 44.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని ఐఎండి తెలిపింది. మే 17 నుండి 21 వరకు రాజస్థాన్, పంజాబ్, హర్యానా, ఢిల్లీలోని అనేక ప్రాంతాలతో సహా ఉత్తర భారతదేశంలో కూడా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని ఐఎండి అంచనా పేర్కొంది. ఉత్తరప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో హీట్ వేవ్ పరిస్థితులు ఉండే అవకాశం ఉంది. గుజరాత్, బీహార్, జార?ండ్, పశ్చిమబెంగాల్, ఒడిశాలలో హీట్‌వేవ్ కొనసాగనుంది.

పశ్చిమ రాజస్థాన్‌లో తీవ్రమైన వేడిగాలలు వీస్తున్నాయి. దీంతో ఐఎండి రెడ్ అలర్ట్ జారీ చేసింది. పంజాబ్, హర్యానా, ఢిల్లీ, తూర్పు రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, బీహార్, గుజరాత్ రాష్ట్రాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. ఇక మధ్యప్రదేశ్, జార?ండ్, పశ్చిమబెంగాల్, ఒడిశా రాష్ట్రాలకు ఎల్లో అలర్ట్‌ను జారీ చేసింది.

ఈ వేసవి సీజన్‌లో హిమాచల్‌లో ఉనాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇక ఆగ్రా 46.9 డిగ్రీల సెల్సియస్, చండీగఢ్ 44.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైందని ఐఎండి తెలిపింది.

### బాబు ప్రమాణ స్వీకారానికి గంటా, జగన్ ప్రమాణోత్సవానికి బొత్స

కూడా ఇస్తున్నారు. అసలు ఆ ఇద్దరు మిత్రులు ఎవరు ఇప్పుడు ఎందుకు ఒకరిపై మరొకరు విమర్శలు చేసుకుంటున్నారు. విశాఖ వేదికగా ఇప్పుడు ఎందుకు రాజకీయాన్ని నడుపుతున్నారు..?

ఉత్తరాంధ్రలో విశాఖ, విజయనగరం జిల్లాలకు కీలకమైన రాజకీయ నాయకులుగా మంత్రి బొత్స సత్యనారాయణ, గంటా శ్రీనివాస్ తమ బలాన్ని చూపిస్తూ వస్తున్నారు. కాంగ్రెస్ నుంచి బొత్స, టీడీపీ నుంచి గంటా 1999లో ఇద్దరూ ఒకేసారి పార్లమెంటు ఎన్నికల్లో గెలిచి పార్లమెంట్లో అడిగి పెట్టారు. బొత్స సత్యనారాయణ బొబ్బిలి ఎంపీగా, గంటా శ్రీనివాసరావు అనకాపల్లి ఎంపీగా తొలి అడుగులోనే విజయం సాధించి ఢిల్లీలో రాజకీయ పాఠాలు నేర్చారు. తర్వాత జరిగిన ఎన్నికల్లో చీపురుపల్లి నుంచి బొత్స, చోడవరం నుంచి గంటా ఇద్దరు ఉమ్మడి ఏపీ అసెంబ్లీకి శాసనసభ్యులుగా ఎన్నికయ్యారు.

ఒక్క 2014లో మాత్రం రాష్ట్ర విభజన తర్వాత కూడా పీసీసీ అధ్యక్షుని హోదాలో కాంగ్రెస్ పార్టీలోనే ఉండి బొత్స సత్యనారాయణ తొలిసారి ఓటమిని చూస్తే, రాజకీయాల్లోకి వచ్చిన రోజు నుంచి నేటి వరకు ఓటమి ఎరుగని నాయకుడిగా గంటా శ్రీనివాసరావు తన రాజకీయ ప్రయాణాన్ని కొనసాగిస్తూనే వస్తున్నారు. రాజకీయాలకు వచ్చిన తొలి రోజుల్లో ఇద్దరూ మంచి మిత్రులు. ఒకే సామాజిక వర్గానికి కూడా చెందిన వారు కావడంతో, పార్టీలు వేరైనా ఆప్తమిత్రులుగా కొనసాగుతూ వచ్చారు కూడా. 2004 లోనే బొత్స రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించగా, 2009 లో కాంగ్రెస్ లో పీఆర్పీ విలీనం తర్వాత గంటా శ్రీనివాసరావు కూడా కిరణ్ కుమార్ రెడ్డి కేబినెట్‌లో చేరడంతో ఇద్దరూ మంత్రివర్గ సహచరులుగా కూడా కలిసి పనిచేశారు.

**ఒకప్పటి మిత్రులు నేటి ప్రత్యర్థులు**

రాష్ట్ర విభజన సమయంలో పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న బొత్స 2014లో తొలిసారి ఓటమి తర్వాత వైసీపీలోకి వెళ్లారు. గంటా టీడీపీకి తిరిగి వెళ్లడంతో రాజకీయ మిత్రులుగా ఉన్న ఇద్దరు పైకి మాత్రం ప్రత్యర్థులుగా మారిపోయారు. బొత్స పీసీసీ అధ్యక్షుడిగా ఉన్ననాటి నుంచే ఇద్దరి మధ్య ఆధిపత్య పోరు ప్రారంభం అయింది. అప్పుడప్పుడు ఇద్దరి మధ్య మాటల యుద్ధం కూడా జరిగింది. ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం లాంటివి జరిగినా, మళ్ళీ కలిసి ఉన్నట్టే నటించేవారు.

అయితే చీపురుపల్లినే నమ్ముకుని రాజకీయం చేస్తున్న బొత్సపై ప్రతి ఎన్నికలలో నియోజకవర్గం మారే గంటాను ఈసారి ఎన్నికల్లో ప్రయోగించాలని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు భావించారు. ఉత్తరాంధ్రకే కీలకమైన నాయకుడిగా ఉన్న బొత్స సత్యనారాయణని ఓడిస్తే, ఉత్తరాంధ్రపై పూర్తిస్థాయిలో పట్టు సాధించవచ్చు అని భావించిన చంద్రబాబు గంటా శ్రీనివాస్ ను చీపురుపల్లి నుండి టీడీపీ అసెంబ్లీ అభ్యర్థిగా బరిలోకి దించాలని అనుకున్నారు. అయితే, గంటాకు ఇష్టం లేకపోవడంతో, ఒకానొక టైంలో చీపురుపల్లికి వెళ్లడానికి సిద్ధమైనా చివరికి భీమిలి నుండి బరిలోకి దిగడానికి గంట శ్రీనివాస్ చంద్రబాబును ఒప్పింపించారు. దీంతో ఇద్దరి మధ్య ప్రచ్ఛన్న పోరు తప్పింది. కానీ భీమిలి అసెంబ్లీ ఉన్న విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బొత్స సతీమణి బొత్స ఝాన్సీ లక్ష్మి బరిలోకి దిగడంతో ఆమెను గెలిపించే బాధ్యత తీసుకున్న బొత్స, భీమిలి లో గంటాపై దృష్టి పెట్టాడు. దాదాపుగా గంటాపై బొత్సనే పోటీ చేసిన స్థాయిలో టార్గెట్ చేస్తూ రాజకీయం చేశారు బొత్స సత్యనారాయణ.

**మా అధినేతే ముఖ్యమంత్రిగా ప్రమాణం చేస్తారంటున్న ఇద్దరు నేతలు**

తాజాగా ఎన్నికల అయిపోయాయి. అందరూ ఫలితాల కోసం ఎదురుచూస్తున్నారు. ఎప్పుడూ లేనిదీ ఇప్పుడు ఇద్దరూ మిత్రులు రాజకీయ శత్రువులుగా ఒకరిపై మరొకరు విమర్శలు చేసుకుంటూ, ఉత్తరాంధ్ర రాజకీయాన్ని మరో స్థాయికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. రానున్న జూన్ 9వ తేదీన చంద్రబాబు సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తారని గంట శ్రీనివాసరావు జోస్యం చెప్తుంటే, ఉత్తరాంధ్ర రాజకీయ ఉద్దండగా పేరు ఉన్న బొత్స సత్యనారాయణ ఇంకోక అడుగు ముందుకేసి అదే జూన్ 9న విశాఖ వేదికగా జగన్మోహన్ రెడ్డి మరోసారి సీఎంగా ప్రమాణస్వీకారం చేస్తారనీ, మాజీ మంత్రి హోదాలో గంటా శ్రీనివాసరావుకు కూడా ఆహ్వానం పంపుతామని, తప్పకుండా రావాలంటూ బొత్స కౌంటర్ వేస్తున్నారు.

దీంతో ఇద్దరి మధ్య పైకి కనిపించని రాజకీయ శత్రుత్వం మరోసారి బయటపడింది. అయితే 2019 ఎన్నికల్లో టీడీపీ నుండి ఎమ్మెల్యేగా గెలిచిన గంటా శ్రీనివాసరావు తర్వాత ఆపార్టీకి, చంద్రబాబుకు కొంత దూరంగానే ఉంటూ వచ్చారు. అధికార వైసీపీలో చేరతారని పెద్ద ఎత్తున ప్రచారం కూడా జరిగింది. ప్రచారం మాత్రమే కాదు. అలాంటి ప్రయత్నాలు కూడా జరిగాయి. ఒకవేళ ఇప్పుడు కూటమి అధికారంలోకి వస్తే టీడీపీని అంటి ముట్టనట్లు ఉన్నాడన్న పేరును పోగొట్టుకోవడానికి గంటా శ్రీనివాసరావు మళ్ళీ మంత్రి పదవికోసం చంద్రబాబు ముఖ్యమంత్రి, ప్రమాణ స్వీకారం అని .మాట్లాడుతూ ఉన్నారని, కూటమి అధికారం లోకి వచ్చేది కలే అంటున్నారు బొత్స. అయితే ఏ పార్టీ గెలుస్తుందో తల పండిన విశ్లేషకులకు సైతం అంతు చిక్కని ఈ ఫలితాలు ఎలా ఉంటాయో ఏమో కానీ, ఆ ఫలితాల వేదికగా ఈ నేతల ఇద్దరి మధ్య జరుగుతున్న ప్రమాణ స్వీకార వివాదం మాత్రం తాజా ప్రస్తావనాంశంగా మారింది. ఎవరి ప్రమాణ స్వీకారానికి ఎవరు వస్తారో అన్న చర్చ ప్రస్తుతం విస్తృతంగా సాగుతోంది.

## తన నూతన యుగంలో భాగంగా కొత్త కార్పొరేట్ గుర్తింపును అమలు చేస్తున్న స్కోడా ఆటో ఇండియా

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** స్కోడా ఆటో ఇండియా తన సరికొత్త కాంపాక్ట్ ఎస్‌యువిని విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. తన పైప్ లైన్‌లో ఉత్పత్తి చర్యల స్ట్రింగ్‌ను కలిగి ఉండగా, కంపెనీ భారతదేశంలో తన కొత్త యుగంలో భాగంగా తన నెట్‌వర్క్, వినియోగదారులను బలోపేతం చేయడంపై దృష్టి సారించింది. డిజిటలైజేషన్ వ్యూహాన్ని మెరుగుపరిచిన అనంతరం బ్రాండ్ ఇప్పుడు డీలర్‌షిప్‌లు, సేవా కేంద్రాలు మరియు ఇతర కస్టమర్ టచ్‌పాయింట్‌ల వంటి తన భౌతిక ఆస్తులలో కొత్త కార్పొరేట్ గుర్తింపును అమలు చేస్తున్నట్లు ప్రకటించింది.

ఈ ప్రకటన గురించి స్కోడా ఆటో ఇండియా బ్రాండ్ డైరెక్టర్ పీటర్ జనేబా ఇలా అన్నారు: "ప్రపంచ స్థాయి కార్లను తయారు చేయడంతో పాటు, మా ప్రయత్నాలు ఎల్లప్పుడూ మా వినియోగదారులు, అభిమానులు, మా కుటుంబాలు, వాటికి సంపూర్ణమైన, అన్నింటినీ ఆవరించే మరియు సుసంపన్నమైన అనుభవాన్ని అందించడంపై దృష్టి సారించాయి. డిజిటలైజేషన్ అనేది వినియోగదారులను చేరుకునేందుకు మేము అనుసరిస్తున్న అనేక మార్గాలలో ఒకటి. మా మెసేజింగ్, మా డిజైన్ భాష, మా గుర్తింపు, మా వినియోగదారులకు మరియు ఇతర వాటాదారులందరికీ మేము అందించే రూపంతో మన స్థిరత్వం కూడా అంతే కీలకం. మేము 2023లో మా కమ్యూనికేషన్‌లు, మా మార్కెటింగ్‌లో మా బ్రాండ్ కొత్త కార్పొరేట్ గుర్తింపును స్థిరంగా, స్పృహతో అమలు చేస్తున్నాము. ఇప్పుడు, మేము దాన్ని తదుపరి దశకు తీసుకువెళ్లేందుకు సిద్ధంగా ఉన్నాము. ఇందులో మా డీలర్‌షిప్‌లు మరియు వివిధ కస్టమర్ టచ్‌పాయింట్‌లు ఉంటాయి" అని తెలిపారు.

**అన్నీ సమరూపంలో ఉన్నాయి**

స్కోడా ఆటో ఇండియా కొత్త స్టైలింగ్, టైప్‌ఫేస్ గుండ్రని ఆకారాలు మరియు సరిహద్దులతో ద్రవత్వాన్ని తెలియజేసేందుకు, పటిష్టతను తెలియజేసేందుకు సమరూపత ఆధారంగా పూర్తిగా కొత్త టైపోగ్రఫీని ఉపయోగిస్తుంది.


మోహన వెంకట రెస్ట్ హోమ్స్ (రి)
ప్రశాంతినగర్, తిరుపతి: ఫోన్ : 9393932718
మీరు ప్రతీఏటా తిరుపతి-తిరుమల పుణ్యక్షేత్రంలోని శ్రీవేంకటేశ్వర, పద్మావతి అమ్మవార్ల దర్శనం ఇష్టంగా చేసుకుంటూ ఉంటారు. రోజు రోజుకు పెరుగుతున్న భక్తుల కారణంగా ఇప్పుడు తిరుపతిలో గాని, తిరుమలలో గాని వసతి చాలా కష్టమవుతోంది.
ఇలాంటి సమస్యకు పరిష్కారంగా తిరుపతిలో (బస్‌స్టాండ్ రైల్వేస్టేషన్‌లకు కేవలం 8.5 కి.మి. దూరంలో) ప్రకృతి వనరులతో 14 ఎకరాల స్థలంలో ప్రశాంతినగర్ నిర్మాణంలో ఉంది.
అనేక అధునాతన సౌకర్యాలతో సుమారు 500 స్టూడియో అపార్ట్‌మెంట్లు మీకు అందుబాటులోకి వస్తున్నాయి. ఇప్పటికే 40 అపార్ట్‌మెంట్లతో ఒక బ్లాక్ సిద్ధంగా ఉంది. 24X7 రవాణాసౌకర్యం కూడా యాజమాన్యం కల్పించింది.
సంవత్సరానికి 5 రోజులు ఈ సుఖప్రదమైన ఆవాసం పొందడానికి మీకు ఇప్పుడు చక్కని అవకాశం లభిస్తోంది. కేవలం ఒక లక్షరూపాయలు (+ 18శాతం జీఎస్టీ చెల్లించి) ఒక సింగిల్ బెడ్ అపార్ట్‌మెంట్‌ను మీరు ఒక సంవత్సరంలో 5 రోజులు చొప్పున 12 ఏళ్ల పాటు వినియోగించుకోవచ్చును.
లభించే సదుపాయాలు : ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ సదుపాయం. 24X7 రవాణా సౌకర్యం. మీరు స్వయంగా కూడా వాహనాలు నడపవచ్చు. (2,4 వీలర్ ఎలక్ట్రిక్ వాహనాలు) 24X7 క్లినిక్, గదిలో ఫ్రిజ్, మంచం, పరుపు, ఏసీ, సోఫా, టేబుల్, ఎల్‌పీజీ స్టౌ, గిన్నెలతో సహా కిచెన్.
పూర్తి శాఖాహార భోజన, ఫలహారశాల, అన్నిరకాల వస్తుసామాగ్రి దుకాణములు, వాకింగ్ ట్రాక్, ఈతకొలను, ఔషధ మొక్కలతో కూడిన వనసంపదల ఉద్యానవనం. అహ్లాదకరమైన ఆధ్యాత్మిక సంగీతభరిత వాతావరణం, ఉచిత వైఫై లభిస్తాయి.
24×7 రక్షణ, లాండ్రీ, ఇతర సేవలు లభిస్తాయి.
వివరములకు సంప్రదించండి.
9393949345, 8247526179

వి-శాఖ సమాచారమ్

ఆదివారం 19-05-2024

# పుస్తక విజ్ఞానం

తెలుగు లోగిళ్లలో ... తొట్టతొలిగా చిట్టి బాలలచేత పుస్తకం పట్టించినప్పుడు ఒప్పజెప్పించే పద్యం, 'తల్లీ! నిన్ను దలంచి.'

బుద్ధి, మనసు కలిసి ఉండే హృదయపీఠం మీద కొలువై ఉన్న చదువులమ్మను - దోషరహితమైన సుస్పష్ట శబ్ద సౌందర్యాన్ని, సుదూర కాలతీరాల వరకు జగన్మోహనంగా వ్యాప్తిచేసే శక్తియుక్తులు ప్రసాదించమని చేసే ప్రార్థన అది.

వాగీశ్వరి హస్తభూషణం పుస్తకం. 'తలవాకిటను మెలగు ఆ చెలువ'ను విద్యాధిదేవతగా ఆరాధించే సంస్కృతి భారతీయులది.

పుస్తకం, విత్తం, కన్య - వరసగా ధర్మార్థ కామ ప్రతీకలు మనకు. కన్యా విత్తాలు కొందరికే సొంతం. పుస్తక విజ్ఞానం అందరికీ చెందే ఆస్థి. చర్మ చక్షువులతో చూడ సాధ్యంకాని మహితాత్ముల మనోభావాలను, జీవితానుభవాలను ముందుతరాలకు అందజేసే ఉత్తమ సాధనం పుస్తకమే.

వ్యాస పీఠంమీద రామాయణం ఉన్నదంటే వాల్మీకి ఆత్మ మనముందు కూర్చుని ధర్మ ప్రబోధం చేస్తున్నట్లే లెక్క. గీతా పఠనం కొనసాగిస్తున్నప్పుడు సాక్షాత్ ఆ జగద్గురువు ప్రత్యక్షమై జీవితం మీది మన విశ్వాసాలను పెంచుతున్నట్లే.

కరుణశ్రీ భావించినట్లు 'కలువలు పూచినట్లు/ చిరుగాలులు వీచినట్లు/ తీవలు తలలూచినట్లు/ పసిపాపలు చేతులూచినట్లు/ ఆత్మలు పెనవేసినట్లు' కవితలు సృజిస్తుంటారు కదా!

కాళిదాసునుంచి కృష్ణశాస్త్రులదాకా! 'గ్రంథాలు ఆత్మబంధువులు' అంటారు గుంటూరు శేషేంద్రశర్మ.

పుస్తకంలో మునిగిన మనిషి పుట్టలో మునిగిన ముని అని ఆరుద్ర చమత్కారం.

మనసును సానబెట్టుకొనే చందనపు చెక్క- గ్రంథం. 'గ్రంథ నిలయంబు శారద కనకపీఠి/ గ్రంథ నిలయంబు కవుల శృంగారవీటి/ గ్రంథ నిలయంబు మోక్ష సద్గతికి చీటి' అన్న నాళం కృష్ణారావు గ్రంథాలయ సూక్తి నూటికి నూరుపాళ్లు నిజం.

విశాల విశ్వాన్ని ఓ పుస్తకాల గదిగా కుదించాలన్నా, పుస్తకాల గదిలోనే ఓ విశాల విశ్వాన్ని సృజించాలన్నా అక్షరానికే సాధ్యం.

అది త్రేతాయుగంనాటి రాముణ్ని కలియుగ దేవుడిగా మారుస్తుంది. తెలుగు త్యాగయ్యను తమిళుల ఆరాధ్యుడిగా తీరుస్తుంది. కంచెర్ల గోపన్న చెరసాల చీకటి శోకాన్ని రామదాసు కీర్తనలుగా వెలిగించినా, హాలుని గాథాసప్తశతి ఘనతను కథలుగా మనకు ఇప్పుడు వినిపించినా ఆ గొప్పతనమంతా అచ్చక్షరానిదే.

గ్రంథస్థ వ్యవస్థే లేకపోతే వేమన వేదాంతం బ్రౌన్ దొరదాకా పాకేదా! అన్నమయ్య పద సంపద ఈ మాత్రమైనా జాతికి దక్కేదా! పరదార కామన, అధికార లాలస, సాధుజన పీడన సర్వనాశనానికీ కారణభూతాలన్న ధర్మసూక్ష్మం - రామాయణ, భారత, భాగవతాదులుగా రాయబట్టేగదా నీతులుగా నిలబడింది! హరిశ్చంద్రుని చరిత్రే గాంధీజీని సత్యాగ్రహిగా మార్చింది. గాంధీజీ సత్యప్రయోగాలే మార్టిన్ లూథర్ కింగ్ పోరుకు ప్రేరణ. చదువు ప్రాముఖ్యమేమిటో హిరణ్యకశిపుని నోటే చెప్పించాడు మహాకవి పోతన. విద్యాగంధం లేక జనుషాంధుల్లాగా ఉన్న కొడుకులను విష్ణుశర్మ అనే పండితుడికి అప్పగిస్తాడు 'నీతిచంద్రిక'లోని సుదర్శన మహారాజు. పరవస్తు చిన్నయసూరి భావించినట్లు మంచిపుస్తకం - 'పలు సందియముల దొలచును/ వెలయించు నగోచరార్థ విజ్ఞానము, లో/కులకు అక్షి.' సందేహం లేదు. ఒకప్పుడు విద్యావంతుల ఇంట ఓ పుస్తకాల గదీ తప్పనిసరి. వివాహాది శుభకార్యాల్లో పుస్తకాలు చదివించడం సదాచారంగా ఉండేది. ఇలా - గతంలో గ్రంథపఠనమంటే ఒక సంస్కార చిహ్నం.

కొన్నేళ్లక్రితందాకా పాఠశాలల్లో పిల్లలకు పుస్తకాలే బహుమానాలుగా దక్కేవి. వాటి స్థానాన్ని ఇప్పుడిప్పుడే మెల్లమెల్లగా 'ఎలక్ట్రానిక్ నోట్‌బుక్' ల్లాంటి ఆధునిక పరికరాలు ఆక్రమిస్తున్నాయి. సాంకేతికత ఎంత పురోభివృద్ధి చెందుతున్నా, పుస్తకం స్థానం ఏ ఈ-పరికరం పూడ్చలేనిది. టీవీ, చలనచిత్ర మాధ్యమాలు ఎంత శక్తిమంతమైనా - పుస్తకంలా 'వ్యక్తిగతం' కాలేవు. అమ్మలా బిడ్డకు మంచిమాటలు నేర్పించగలిగేది, బొమ్మల పుస్తకమే! తండ్రినుంచి దండన భయం ఉండొచ్చు. ఏ దండనా లేకుండా మంచిదారి చూపించగలిగేదీ పుస్తకమే! రోమన్ సేనాపతి మార్కస్ అరీలియస్ యుద్ధ ఆందోళనల మధ్య సాంత్వన కోసం శిబిరంలో పుస్తకం పట్టుకుని కూర్చునేవాడు. ఎన్ని రాచకార్యాలున్నా రాయలవారు విధిగా విద్వద్గోష్ఠులు నిర్వహించేవారు. తాళపత్ర గ్రంథాలను తులసిదళాలంత పవిత్రంగా భావించిన తరాలు మన తాతలవి. ఇప్పుడా 'పుస్తకాల పిచ్చి' పిచ్చిపుస్తకాల స్థాయికి దిగజారుతుండటమే దిగులు చెందాల్సిన అంశం. అమెరికన్ రచయిత ఎమిలీ డికెన్సన్ శ్లాఘించినట్లు, పుస్తకం- 'మానవాత్మను మనోవేగంతో స్వప్నలోకాలన్నీ తిప్పి తీసుకురాగల రెక్కల గుర్రం.' ఆ అపూర్వ అనుభవాన్ని పసిపిల్లలనుంచి దూరం చేస్తున్న కంప్యూటర్ సంస్కృతి మీద గోథెన్‌బర్గ్ విశ్వవిద్యాలయంవారు పరిశోధనలు సాగిస్తున్నారు. ఆధునిక పరికరాల వినియోగం అతిగా ఉన్న అమెరికా, స్వీడన్ దేశాల బాలలు మేధోపరిజ్ఞాన రంగంలో బాగా వెనకబడిపోతున్నారన్నది వారి తాజా పరిశోధనల ఫలితం. పుస్తక పఠనంమీద అధికంగా ఆధారపడిన ఇటలీ, హంగరీ దేశాల పిల్లల ప్రజ్ఞ- అభివృద్ధి చెందిన దేశాల బాలబాలికల ప్రతిభాపాటవాలకన్నా చాలా ముందంజలో ఉందని పరిశోధకబృంద నాయకురాలు ప్రొఫెసర్ మోనికా రోజెన్ నిర్ధారించారు. మితిమీరిన సాంకేతిక వినియోగ వ్యసన సంస్కృతినుంచి అచ్చక్షరాల సంస్కృతిని తిరిగి అందిపుచ్చుకోవాల్సిన అవసరాన్ని ఈ పరిశోధనలు తెలియజేస్తున్నాయి. కన్యాశుల్కం గిరీశంలాగా 'బయింగ్ బుక్స్... బార్బేరియస్!' అని ఈసడించుకుంటే - మనిషి కథ అడ్డం తిరగడం ఖాయం.

# వరహాల గెడ్డ ఆక్రమణలు అరికట్టండి





**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** పార్వతీపురంలోని వరహాల గెడ్డలో జరుగుతున్న ఆక్రమణలు అరికట్టాలని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి పార్వతిపురం జిల్లా అధ్యక్షులు వంగల దాలి నాయుడు కోరారు. శనివారం ఆ సమితి పట్టణ అధ్యక్షులు సిగడాం భాస్కరరావు, మండల అధ్యక్షులు బలగ శంకరరావు, మున్సిపల్ కౌన్సిలర్ రణభేరి బంగారు నాయుడుతో కలిసి పార్వతిపురం బైపాస్ రోడ్డులో గల వరహాల గెడ్డను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్వతీపురం పట్టణానికి ప్రకృతి ప్రసాదంగా లభించిన వరహాల గెడ్డను కొంతమంది అక్రమార్కులు ఆక్రమణలకు పాల్పడుతున్నారన్నారు. పట్టణంలోని మురుగునీతినంతటిని వరాహాలు గెడ్డ రైల్వే స్టేషన్ సమీపంలో గల ఏడు కాణాల ద్వారా బయటికి ప్రవహించేలా చేస్తుందన్నారు. పార్వతీపురం మండలంలో రైతులకు సాగునీటిని అందిస్తోందన్నారు. గత కొన్నేళ్లుగా పట్టణానికి చెందిన పలువురు వ్యక్తులు దర్జాగా కబ్జా చేస్తున్నారన్నారు. అయినప్పటికీ సంబంధిత మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్, సచివాలయ తదితర శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది కనీసం స్పందించడం లేదన్నారు. పార్వతీపురం మున్సిపాలిటీలోని పలు చెరువులు ఇప్పటికే కబ్జా కోరల్లో చిక్కుకొని పక్క భవనాలు నిర్మాణాలు జరిగాయన్నారు. వరహాల గెడ్డ కబ్జాలు గూర్చి సాక్షాత్తు జిల్లా కలెక్టర్ స్పందన కార్యక్రమంలో పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ పట్టించుకునే దాఖలాలు లేవన్నారు. దీంతో కోట్లాది రూపాయలు విలువైన ప్రభుత్వ చెరువులు, వరహాల గెడ్డ కబ్జాలకు గురై పక్కా భవనాలు నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ప్రస్తుతం బైపాస్ రోడ్డులో గల వరహాలు గెడ్డను పలువురు యంత్రాలు పెట్టి ఆక్రమణలు చేసేందుకు పాల్పడుతున్నారని ఆరోపించారు. తక్షణమే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వరహాల గెడ్డ ఆక్రమణలు అరికట్టాలని కోరారు. ఇప్పటికే చెరువులను కబ్జా చేసిన కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కబ్జాల సమయంలో పనిచేసే ఆయా శాఖలకు చెందిన సిబ్బంది, అధికారులను విధులనుండి తొలగించాలన్నారు.

**ఖరీఫ్ కు నీటి ఎద్దడి లేకుండా చూడాలి**

అనంతరం కొత్తవలస వద్ద గల జంఝావతి ఎడమ కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నైరుతి రుతు పవనాలు మరికొద్ది రోజుల్లో జిల్లాను తాకనున్నాయన్నారు. వర్షాలు రాక ముందే సాగునీటి కాలువలో పూడికతీత పనులు చేపట్టాలన్నారు. కాలువల్లో తూటుబడ్లు, పిచ్చి మొక్కలు, తుప్పలతో నిండుకున్న కారణంగా నీరు ప్రవహించే పరిస్థితి లేదన్నారు. కాబట్టి కాలువల్లో జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలన్నారు. అలాగే చెరువులకు మధుములు, పాడైన షట్టర్లను ఏర్పాటు చేయాలన్నారు. ఈ ఖరీఫ్ లో రైతుకు సాగునీటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

# సింహాద్రి అప్పన్న దేవాలయంలో ఎలక్ట్రిక్ బస్సులు ప్రారంభం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** సింహాచలం అప్పన్న దేవాలయంలో ఎలక్ట్రిక్ బస్సులను ఆలయ చైర్మన్ అశోక్ గజపతిరాజు, ఈవో శ్రీనివాసమూర్తి ప్రారంభించారు. ఒక్కో బస్సు ఖరీదు రూ.కోటి 65 లక్షలు అని తెలుస్తోంది. ఎలక్ట్రిక్ బస్సులు కావడంతో ఒక్కో బస్సును రెండున్నర గంటల పాటు చార్జింగ్ చేయాల్సి ఉంటుంది. ఒకసారి ఛార్జింగ్ చేస్తే 225 కిలోమీటర్ల పాటు ప్రయాణం చేస్తుంది. ఈ సందర్భంగా అశోక్ గజపతి రాజు మాట్లాడుతూ.. భక్తుల సౌకర్యార్థం ప్రకృతి వనరులను కాపాడుకునేందుకు.. కాలుష్యాన్ని తగ్గించేందుకు కరెంట్‌తో నడిచే వాహనాలు అవసరమన్నారు. దీనికోసం రెండు బస్సులను కొనుగోలు చేసి భక్తులకు అందించామని అశోక్ గజపతి రాజు తెలిపారు. ప్రస్తుతం బస్సు టికెట్ పెంచే యోచన లేదన్నారు. గతంలో సాధారణ బస్సు టికెట్ రేటు 15 రూపాయలు ఉంటే.. అదే టికెట్ రేటుతో ఏసీలో భక్తులను సింహగిరికి చేరుస్తామన్నారు. ఈ బస్సు సాధ్యాసాధ్యాలను పరిశీలించి, పొల్యూషన్ లేని మరిన్ని వాహనాలను కొనుగోలు చేస్తామని చైర్మన్ అశోక్ గజపతి రాజు వెల్లడించారు.

# పరిపాలనా విభాగాలను పరిశీలించిన రిజిస్ట్రార్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఆంధ్రవిశ్వవిద్యాలయం పరిపాలనా భవనంలో పలు విభాగాలను రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ శనివారం పరిశీలించారు. పరిపాలనా విభాగంలో సేవలు అందిస్తున్న ప్రతీ విభాగాన్ని ప్రత్యక్షంగా పరిశీలించి, సంబంధిత సిబ్బందితో మాట్లాడారు. కార్యాలయాలు ఆధునీకరణ, అవసరమైన మార్పులు, మరమ్మత్తులు చేపట్టడం తదితర అంశాలపై సిబ్బంది సూచనలు, ఆలోచనలు తీసుకున్నారు. ప్రతీ విభాగాన్ని పూర్తిస్థాయిలో ఆధునీకరించడం, విద్యార్థులకు, ఉద్యోగులకు మరింత సమర్ధ సేవలు అందించడం లక్ష్యంగా ఆలోచన చేయాలని సూచించారు. రిజిస్ట్రార్ వెంట డి.ఆర్ సాంబమూర్తి, ఏఆర్ గంట గోపాల కృష్ణ, పలువురు సూపరిండెంట్‌లు తదితరులు ఉన్నారు.

# నిఖత్, మినాక్షి 12 పతకాలతో ఎలోర్డా కప్ 2024ను పూర్తి చేయడంతో స్వర్ణం సాధించారు

**అస్తానా (కజకిస్తాన్):** కజకిస్తాన్‌లోని అస్తానాలో శనివారం నాడు భారత జట్టు ఎలోర్డా కప్ 2024 ప్రచారాన్ని 12 పతకాలతో ముగించడంతో ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ నిఖత్ జరీన్ మరియు మినాక్షి బంగారు పతకాలను కైవసం చేసుకున్నారు.

నిఖత్ మరియు మినాక్షి బంగారు పతకాలతో పాటు, భారతీయ బాక్సర్లు రెండు రజతాలు మరియు ఎనిమిది కాంస్య పతకాలను గెలుచుకున్నారు, వారి గత ఎడిషన్ ఐదు పతకాల రికార్డును మెరుగుపరిచారు.

నిఖత్ (52 కేజీలు) కొనసాగుతున్న ప్రతిష్టాత్మక టోర్నమెంట్‌లో తన ఆధిపత్యాన్ని కొనసాగించింది, ఆమె ఏకగ్రీవంగా 5-0 స్కోర్‌లైన్‌తో కజకిస్తాన్‌కు చెందిన జాజిరా ఉరక్‌బయేవాను అధిగమించి ఆమె గౌరవనీయమైన పతక పట్టికలో మరో బంగారు పతకాన్ని జోడించింది.

మహిళల 48 కేజీల ఫైనల్లో ఉజ్బెకిస్థాన్‌కు చెందిన రహ్మోనోవా సైదాహోన్‌ను 4-1 తేడాతో ఓడించి భారత్‌కు పోటీలో తొలి స్వర్ణ పతకాన్ని అందించిన మినాక్షి భారత్‌కు శుభారంభం చేసింది.

కాగా, అనామిక (50 కేజీలు), మనీషా (60 కేజీలు) ఓడిపోయి రజత పతకాలతో తమ ప్రచారాన్ని ముగించారు.

అనామిక ధీటుగా పోరాడి, ప్రస్తుత ప్రపంచ మరియు ఆసియా ఛాంపియన్ చైనాకు చెందిన వు యుపై 1-4 తేడాతో ఓటమిని అంగీకరించగా, మనీషా కజకిస్తాన్‌కు చెందిన విక్టోరియా గ్రాఫీవాపై 0-5 తేడాతో ఓటమిని ఎదుర్కొంది.

**పతక విజేతలు:**



**స్వర్ణం:** మినాక్షి (48 కేజీలు), నిఖత్ జరీన్ (52 కేజీలు)

**రజతం:** అనామిక (50 కేజీలు), మనీషా (60 కేజీలు)

**కాంస్య:**

(పురుషులు) యైఫాబా సింగ్ సోయిబమ్ (48 కేజీలు), అభిషేక్ యాదవ్ (67 కేజీలు), విశాల్ (86 కేజీలు) మరియు గౌరవ్ చౌహాన్ (92ం కేజీలు)బీ (మహిళలు) సోను (63 కేజీలు), మంజు బాంబోరియా (66 కేజీలు), శలాఖా సింగ్ సంసన్వాల్ (70 కేజీలు) మరియు మోనికా (81+ కేజీలు).

# సివిల్స్ విజేత నరేంద్ర పడాల్‌కి ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి అభినందనలు



**పాడేరు, (విశాఖ సమాచారమ్):** సివిల్స్ లో సత్తా చాటిన హుకుంపేట మండలం అండిబ గ్రామానికి చెందిన చిట్టపులి నరేంద్ర పడాల్ గారికి పాడేరు శాసనసభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్షులు శ్రీమతి కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అభినందనలు తెలిపారు. అండిబ గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన ఆత్మీయ అభినందన కార్యక్రమంలో భాగ్యలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మన ఆదివాసి బిడ్డ సివిల్స్ లో ఆల్ ఇండియా ర్యాంకు 545 వరకు రావడం నిజంగా గర్వించదగ్గ విషయమని పేర్కొన్నారు. నరేంద్ర పడాల్ ఇక్కడ గిరిజన యువతకు స్ఫూర్తిగా నిలిచారని ఆయన విజయాన్ని ఆదర్శంగా తీసుకొని మరింతమంది సివిల్స్ సాధించే దిశగా అడుగులు వేయాలని భాగ్యలక్ష్మి సూచించారు.

# ఈనెల 19, 20, 21 జరగవలసిన సంస్కృతి కార్యక్రమాలు వాయిదా

**అరకులోయ, (విశాఖ సమాచారమ్):** ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సాంస్కృతి కార్యక్రమాలు తాత్కాలికంగా వాయిదా జూన్ 15 తరువాత సాంస్కృతిక కార్యక్రమాలు జరుపుటకు ఆలయ కమిటీ నిర్ణయం తీసుకుంది అరకులోయలో వేంచేసి ఉన్న శ్రీ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో 19 వ తేదీ అనగా ఆదివారం నాడు శ్రీ వెంకన్న కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు, ఆలయ, ఉత్సవ కమిటీ నాయకులు తెలియజేశారు. అయితే ఎన్నికల కోడ్, 144 సెక్షన్ అమలు లో ఉన్నందున జిల్లా ఉన్నత అధికారులు ఆదేశాలు, సూచనలు మేరకు 19, 20, 21 వ తేదీలలో మూడు రోజులు పాటు జరగాల్సిన సాంస్కృతిక కార్యక్రమాలు ( స్టేజి ప్రోగ్రాం ) ను తాత్కాలికంగా వాయిదా వేస్తూ, వచ్చేనెల జూన్ 15 వ తేదీ తర్వాత నిర్వహించేందుకు కమిటీ నిర్ణయం తీసుకుందన్నారు. కాగా కమిటీ నాయకులు మాట్లాడుతూ ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించి ఆలయ, ఉత్సవ కమిటీకి సహకరించగలరని కోరారు.

కాగా 19వ తేదీ సాయంత్రం శ్రీ వెంకన్న ఆలయ ప్రాంగణంలో యధావిధిగా జరగబోయే స్వామి వారి కల్యాణ మహోత్సవంలో భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆలయ, ఉత్సవ కమిటీలు విజ్ఞప్తి చేశాయి.

# నేడు సుంకరమెట్ట సత్యనారాయణ స్వామివారి వార్షిక కళ్యాణ మహోత్సవం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** స్వస్తిశ్రీ క్రోధినామ సంవత్సర వైశాఖ శుద్ధ ఏకాదశి, ఆదివారం ఉదయం గంటలు 9.09 నిలకు ఆలయ చైర్మన్ కే . ఎం నాయుడు ఆధ్వర్యంలో శ్రీ సత్యనారాయణ మూర్తి స్వామి వారికి వార్షిక కళ్యాణ మహోత్సవం నిర్వహించబడును. కావున భక్తులందరూ స్వామివారి కళ్యాణాన్ని తిలకించి, తీర్థప్రసాదాలను స్వీకరించాలని, ఆలయ చైర్మన్ ఏం నాయుడు భక్తులను కోరారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి మహిళల చే కోలాట కార్యక్రమములు , సాంస్కృతిక కార్యక్రమములు నిర్వహించబడును. స్వామి వారి భక్తులు అందరూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా నాయుడు కోరారు.

# జోన్-2 పరిధిలో 20 వ తేదిన తాగునీటికి అంతరాయం

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ జోన్-2 నందు పలు ప్రాంతాలలో మే 20వ తేదీన తాగునీరుకు అంతరాయం ఏర్పడునని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ శనివారం పత్రికా ప్రకటన ద్వారా రెండవ జోన్ ప్రజలకు తెలిపారు.

జీవీఎంసీ తాగునీటి విభాగం ప్రజలకు మెరుగైన త్రాగునీరు సరఫరా చేయు నిమిత్తం బోని గ్రామం వద్ద ఉన్న గోస్తని హెడ్ వాటర్ వర్క్స్ నుండి తగరపువలస వరకు నూతనంగా 400 %ఎఎ% మందం కలిగిన పైపులైన్లు వేస్తున్నందున మే 20వ తేదీ సోమవారం 2వ జోన్ పరిధిలోని బోయిపాలెం హౌసింగ్ కాలనీ, పరదేశి పాలెం, ఈ.డబ్ల్యూ.ఎస్ కాలనీ, పరదేశి పాలెం విలేజ్, బోరవాణి పాలెం విలేజ్, మారికవలస విలేజ్, పి.పి.2 హౌసింగ్ కాలనీ, సాయిరాం కాలనీ ఫేస్ 2&3, జి సి సి లేఅవుట్, భగవాన్ దాస్ కాలనీ, రేవళ్లపాలెం, ఎం ఎస్ ఆర్ లేఅవుట్, సంపత్ నగర్, సాయి ప్రియ లేఅవుట్, గాయత్రీ నగర్ హౌసింగ్ కాలనీ, పీఎం పాలెం మొదటి బస్ స్టాప్ ఏరియా, స్టేడియం వెనుక ఏరియా నందు తాగునీరు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈ తాగునీటి సరఫరా అంతరాయానికి ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా పైన తెలిపిన ప్రాంతాలలో ప్రజలకు నీటి సరఫరా చేయబడు నన్నారు, కావున ప్రజలకు కలుగు అసౌకర్యానికి చింతిస్తూ జివిఎంసి మంచినీటి సరఫరా విభాగం వారికి నగర ప్రజలు సహకరించవలసినదిగా కమిషనర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# జుట్టు ఎక్కువగా రాలిపోతోందా ? ఈ ప్యాక్‌తో వెంటనే ఆగుతుంది



మీ జుట్టు ఆరోగ్యంగా ఉండేందుకు హెన్నా మరియు కరివేపాకు హెయిర్ మాస్క్ ఉపయోగించవచ్చు. ఈ హెయిర్ ప్యాక్ ఎలా తయారు చేయాలో, మీకు ఎలాంటి ప్రయోజనాలు లభిస్తాయో ఇక్కడ తెలుసుకోండి.

హెన్నా వివిధ జుట్టు సమస్యలను నయం చేయడానికి దాదాపు మ్యాజిక్ లాగా పనిచేస్తుంది. అందువల్ల, ఈ సహజ పదార్థం ఇంటి అలంకరణలో యుగాలుగా ఉపయోగించబడింది. హెన్నాను గ్రే హెయిర్‌ను కవర్ చేయడానికి సహజ రంగుగా ఉపయోగించినట్లు, జుట్టును సిల్కీగా మృదువుగా ఉంచడంలో కూడా ఇది ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది.

అయితే కరివేపాకును హెన్నాతో కలిపి జుట్టుకు రాసుకుంటే మరిన్ని లాభాలు పొందుతారని మీకు తెలుసా? మనకు తెలిసినట్లుగా, జుట్టు యొక్క సహజ రంగును నిర్వహించడంలో ఈ ఆకు ప్రత్యేక పాత్ర పోషిస్తుంది. ఇతర జుట్టు సమస్యలను నియంత్రించడంలో కూడా ఇది ప్రత్యేక పాత్ర పోషిస్తుంది. ఈ ప్రత్యేకమైన హెన్నా హెయిర్ ప్యాక్‌ను ఎలా తయారు చేయాలో మరియు దానిని ఎలా ఉపయోగించాలో చూద్దాం.

కరివేపాకులో విటమిన్ సి మరియు బి పుష్కలంగా ఉంటాయి. ఈ ఆకుల్లో యాంటీ ఆక్సిడెంట్లు మరియు అమైనో యాసిడ్లు కూడా ఉన్నాయి, ఇవి తలకు రక్త ప్రసరణను పెంచి మంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో పాత్ర పోషిస్తాయి. కరివేపాకులో కాల్షియం, ఐరన్ మరియు ఫాస్పరస్ వంటి ముఖ్యమైన పోషకాలు కూడా ఉన్నాయి. జుట్టులో పోషకాల కొరతను ఇవి భర్తీ చేస్తాయి. కరివేపాకులో ఉండే ప్రయోజనకరమైన పదార్థాలు జుట్టు రాలడాన్ని తగ్గించడంలో ప్రభావవంతమైన పాత్ర పోషిస్తాయి. సన్నని వెంట్రుకలు గట్టిపడటంలో కూడా ప్రత్యేక పాత్ర పోషిస్తాయి.

**జుట్టు సంరక్షణకు హెన్నా ఎందుకు ఉపయోగించాలి?**

హెన్నా నేచురల్ కండీషనర్‌గా ప్రత్యేక పాత్ర పోషిస్తుంది. విటమిన్ ఇ హెన్నాలో లభిస్తుంది, కాబట్టి ఇది మంచి స్కాల్ప్ ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో కూడా ప్రత్యేక పాత్ర పోషిస్తుంది. జుట్టు యొక్క సహజ తేమను నిర్వహిస్తుంది. జుట్టు రాలడాన్ని తగ్గిస్తుంది. ఈ సహజ పదార్థాన్ని సహజమైన జుట్టు రంగుగా కూడా ఉపయోగించవచ్చు. హెన్నాలో ఉండే టానిన్ జుట్టు సంరక్షణలో ప్రభావవంతమైన పాత్ర పోషిస్తుంది.

**హెన్నా మరియు కరివేపాకు హెయిర్ మాస్క్**

కొన్ని కరివేపాకులను తీసుకోండి. బాగా కడిగి ఆరబెట్టాలి. ఇప్పుడు ఆ ఆకులను రుబ్బుకోవాలి. హెన్నా పొడిని కరివేపాకుతో కలపండి. సరిపడా నీళ్లతో మొత్తాన్ని కలపడం ద్వారా మీ హెయిర్ మాస్క్ రెడీ అవుతుంది.

మీకు కావాలంటే, మీరు ఈ హెయిర్ ప్యాక్‌లో కొద్దిగా కొబ్బరి నూనె లేదా బాదం నూనెను కూడా కలపవచ్చు. ఇది మరిన్ని ప్రయోజనాలను అందిస్తుంది.

**ఎలా ఉపయోగించాలి?**

హెన్నా మరియు కరివేపాకు హెయిర్ ప్యాక్ ఉపయోగించే నియమాలు చాలా సులభం. ముందుగా జుట్టును విడదీ యండి. తర్వాత నెమ్మదిగా ఈ హెయిర్ ప్యాక్‌ని కుదుళ్ల మొదళ్లు, స్కాల్ప్ మరియు జుట్టు మీద అప్లై చేయండి. 40-60 నిమిషాలు వేచి ఉండండి. తర్వాత షాంపూతో తలస్నానం చేయాలి. చివరగా కండీషనర్ అప్లై చేయడం మర్చిపోవద్దు.

# ధనియాలు వంటకే పరిమితం కాదు!



దేశంలో ప్రతి కిచెన్‌లో మసాలా దినుసులు తప్పకుండా ఉంటాయి. అందులో ధనియాలు అతి ముఖ్యమైనవి. ఎందుకంటే ధనియాలు వాడకుండా దాదాపుగా ఎలాంటి వంట ఉండదేమో. ధనియాలు ఇంచు మించు అన్ని వంటల్లో వినియోగిస్తుంటారు. అదే సమయంలో ధనియాల నీటితో కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి చాలా తక్కువ మందికి తెలుసు.

వాస్తవానికి చాలా మంది ధనియాలను వంటల్లో వినియోగిస్తుంటారు. ధనియాలు ఉపయోగించడం వల్ల ఆ వంటల రుచి పెరుగుతుంది. నేరుగా వేయవచ్చు లేదా ధనియాల పౌడర్ వాడుతుంటారు. నాన్‌వెజ్ వంటల్లో అయితే తప్పనిసరి. ధనియాల పౌడర్ వేయాల్సిందే. అయితే ధనియాల పౌడర్‌ను వంటల్లో రుచిని పెంచడంతో పాటు ఆరోగ్యపరంగా ప్రయోజనం చేకూర్చేందుకు కూడా ఉపయోగిస్తారు. ఎందుకంటే ధనియాల్లో పోషకాలు చాలా ఎక్కువ. ధనియాల్లో ఉండే కొన్ని రకాల పోషకాల వల్ల వివిధ రకాల వ్యాధులు కూడా దూరమౌతాయి. బ్లడ్ షుగర్ తగ్గించేందుకు ధనియా నీళ్లు అద్భుతంగా ఉపయోగపడతాయి. జీర్ణక్రియ మెరుగుపడేందుకు కూడా ధనియాలు దోహదం చేస్తాయి.

ధనియా గింజల్లో పొటాషియం, కాల్షియం, విటమిన్ కే వంటి పోషకాలు చాలా ఎక్కువ. అందుకే ధనియాలు రోజూ భోజనం తరువాత కొద్దిగా నమిలి తినడం లేదా రోజూ ఉదయం పరగడుపున ధనియాల నీళ్లు తాగడం వల్ల శ్వాస సంబంధం సమస్యలు దూరమౌతాయి. ధనియాల నీళ్లతో కలిగే ఇతర ఆరోగ్య ప్రయోజనాలు చాలా ఉన్నాయి. ధనియా నీళ్లు చాలా సులభంగా చేసుకోవచ్చు. 2-3 కప్పుల నీళ్లలో ఒక స్పూన్ ధనియాల వేసి బాగా ఉడకబెట్టాలి. ఆ తరువాత ఈ నీళ్లను వడకాచి గోరువెచ్చగా తాగితే మంచి ఫలితాలుంటాయి.

డయాబెటిస్ రోగులు బ్లడ్ షుగర్ లెవెల్స్ ఎప్పుడూ నియంత్రణలో ఉండేట్టు చూసుకోవాలి. దీనికోసం ప్రతి రోజూ పరగడుపున ధనియా నీళ్లు తాగితే మంచి ఫలితాలుంటాయి. బ్లడ్ షుగర్ తగ్గి నియంత్రణలో ఉంటుంది. కొత్తిమీరలో కూడా ఆరోగ్యపరంగా ప్రయోజనాలు అత్యధికం. రక్తంలో గ్లూకోజ్ తొలగించి నియంత్రణలో ఉండేట్టు చేస్తుంది.

ధనియా నీళ్లు ఏ సీజన్‌లో అయినా సరే తాగవచ్చు. ఇదొక అద్భుతమైన డీటాక్స్ డ్రింక్ కూడా. ధనియా నీళ్లు తాగడం వల్ల శరీరానికి చలువ చేస్తుంది. దాంతోపాటు కిడ్నీ క్లీన్ అవుతుంది. శరీరంలోని వ్యర్థాలు బయటకు తొలగిపోతాయి.

రోజూ ధనియా నీళ్లు తాగే అలవాటుంటే అంతకంటే మంచి అలవాటు మరోటి లేదనే చెప్పాలి. ఎందుకంటే ఈ ఒక్క అలవాటు మీ శరీరం ఇమ్యూనిటీని వేగంగా పెంచుతుంది. ఇమ్యూనిటీ పెరిగిందంటే సహజంగానే ఎలాంటి రోగాలు దరిచేరవు. ధనియాలో ఉండే కెరోస్టీన్, టోకోఫెరోల్ అనే యాంటీ ఆక్సిడెంట్లు శరీరాన్ని నష్టపర్చే ఫ్రీ రాడికల్స్‌తో పోరాడుతాయి.

# మీ కాళ్లలో ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్ చెకప్‌కు వెళ్లండి



మన శరీరంలో కాలేయం అత్యంత ముఖ్యమైన అవయవం. శరీరంలోని విష పదార్థాలను విచ్ఛిన్నం చేయడం, పిత్తాన్ని ఉత్పత్తి చేయడం వంటి వివిధ విధులను కాలేయం నిర్వహిస్తుంది. ఇటీవల కాలంలో అనేక మంది కాలేయ సంబంధిత వ్యాధుల భారీన పడుతున్నారు. నిజానికి కాలేయం దెబ్బతినడానికి అనేక కారణాలు ఉండవచ్చు. ఐతే శరీరంపై కనిపించే కొన్ని లక్షణాల ఆధారంగా కాలేయ వ్యాధిని ప్రారంభంలోనే సులువుగా గుర్తించవచ్చు. కాలేయ వ్యాధి లక్షణాలు పాదాలలో కూడా కనిపిస్తాయి. కాలేయం దెబ్బతిన్నప్పుడు పాదాలలో ఈ సంకేతాలు కనిపిస్తాయి.

**వాపు:** పాదాలు, చీలమండలలో వాపు కనిపిస్తుంది. హెపటైటిస్ బి, హెపటైటిస్ సి, సిర్రోసిస్, ఫ్యాటీ లివర్ డిసీజ్ మొదలైన కాలేయ సంబంధిత వ్యాధులకు సంకేతమని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. మీకు హెపటైటిస్ బి లేదా హెపటైటిస్ సి ఉన్నట్లయితే మీకు కాలేయ క్యాన్సర్ ప్రమాదం అధికంగా ఉంటుంది. ఎందుకంటే ఈ వ్యాధులు తరచుగా సిర్రోసిస్ ప్రమాదాన్ని పెంచుతాయి. కాలేయ వ్యాధి సిర్రోసిస్‌గా మారితే కాలేయ క్యాన్సర్ వచ్చే ప్రమాదం పెరుగుతుంది. కాబట్టి మీ పాదాలలో వాపు కనిపిస్తే ఆలస్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించడం మర్చిపోకండి.

**పాదం అడుగున దురద:** హెపటైటిస్ ఉన్న కొంతమంది రోగుల్లో అరి చేతులు, అరి కాళ్లు దురద ఉంటుంది. చేతులు, కాళ్ళ చర్మం పొడిగా మారుతుంది. ఇటువంటి లక్షణాలు కనిపించిన వెంటనే చేతులు, పాదాలకు మాయిశ్చరైజర్ ఉపయోగించడం మంచిది.

**పాదాలలో నొప్పి:** కాలేయ వ్యాధి కారణంగా పాదాల నొప్పి సంభవిస్తుంది. కాలేయం సరిగ్గా పని చేయకపోతే ఎడెమాలో ద్రవం శరీరంలో చేరడం ప్రారంభమవుతుంది. కాళ్ళ నరాలు దెబ్బతినడం వల్ల కాళ్ళలో తిమ్మిరి, బలహీనత, నొప్పి కనిపిస్తుంది. ఈ లక్షణాలు ఉన్నవారికి దీర్ఘకాలిక కాలేయ వ్యాధితో సంబంధం ఉంటుంది. కాలేయ వ్యాధికి హెపటైటిస్ ముఖ్య కారణం. కాలేయంలో సమస్య ఉంటే కాలు దిగువన నొప్పి, వాపు ఉంటుంది.

**పాదాల తిమ్మిరి:** హెపటైటిస్ సి ఇన్ఫెక్షన్ లేదా ఆల్కహాలిక్ లివర్ డిసీజ్ కారణంగా కాలేయ సమస్యలున్న వ్యక్తుల కాళ్లలో తిమ్మిరి సంభవిస్తుంది. ఈ రెండు సమస్యలు డయాబెటిక్ పేషెంట్లలో కూడా కనిపిస్తాయి. కాలేయ సమస్యలు ఉన్నవారిలో ఇది చాలా సాధారణం.

**ఆల్కహాలిక్, నాన్-ఆల్కహాలిక్ కాలేయ వ్యాధి అంటే ఏమిటి?**

ఆల్కహాల్ ఎక్కువగా తాగినప్పుడు ఆల్కహాలిక్ లివర్ డిసీజ్ వస్తుంది. కొవ్వు పదార్థాలను ఎక్కువగా తిన్నప్పుడు నాన్-ఆల్కహాలిక్ లివర్ డిసీజ్ సంభవిస్తుంది. దీని వలన కాలేయంలో కొవ్వు పేరుకుపోతుంది. సాధారణంగా కాలేయ వ్యాధి ఉన్నవారికి అలసట, బలహీనత, అనారోగ్యం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం, అరచేతులపై ఎర్రటి మచ్చలు వంటి లక్షణాలు కనిపిస్తాయి.

# కలర్‌ఫుల్ క్యాప్సికమ్స్‌తో ఎన్ని ఆరోగ్య ప్రయోజనాలో !



కంటి ఆరోగ్యం: క్యాప్సికమ్‌లోని లుటిన్, జియాక్సంతిన్ కెరోటినాయిడ్లు కంటి ఆరోగ్యాన్ని మెరుగు పరచడంలో సహాయపడతాయి. ఇంకా క్యాప్సికమ్‌ని తినడం వల్ల కంటి శుక్లం, క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల కంటిశుక్లం, మాక్యులార్ డీజెనరేషన్ వంటి దృష్టి లోపాల ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చు.

బరువు తగ్గడం: రెడ్ క్యాప్సికమ్స్‌లోని పోషకాలు థర్మోజెనిసిస్‌ని సక్రియం చేయడం, జీవక్రియ రేటును పెంచడంలో సహాయపడతాయి. అంతేకాక హృదయ స్పందన రేటు, రక్తపోటు క్రమబద్ధీకరించడంతో పాటు జీర్ణ సంబంధిత సమస్యలను నిరోధిస్తుంది.

రక్తహీనతకు చెక్: క్యాప్సికమ్‌లో ఐరన్, విటమిన్ సి అధిక మొత్తంలో ఉంటాయి. ఇవి శరీరంలో ఎర్ర రక్త కణాల ఉత్పత్తిని పెంచడం ద్వారా రక్తహీనత సమస్యకు చెక్ పెడతాయి. ఈ కారణంగానే రక్తం లేనివారు క్యాప్సికమ్‌ని తినాలని చెబుతుంటారు.

క్యాన్సర్ దూరం: యాంటీఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాల కారణంగా క్యాప్సికమ్ క్యాన్సర్ నిరోధకంగా పనిచేస్తుంది. ఇంకా క్యాన్సర్ కణాలను విచ్ఛిన్నం చేసి, భవిష్యత్తులో ఈ సమస్య ఎదురు కాకుండా చేస్తాయి.

చర్మ సంరక్షణ: క్యాప్సికమ్‌లోని క్యాప్సైసిన్ చర్మాన్ని అనేక సమస్యల నుంచి రక్షిస్తుంది. ఇంకా ఇందులోని యాంటీఆక్సిడెంట్ లక్షణాలు ఫ్రీరాడికల్స్‌తో పోరాడి, చర్మ సమస్యలను దూరం చేస్తాయి.

# ఆరోగ్యానికి వరం లెమన్ వాటర్



నిమ్మకాయలో ఎన్నో పోషకాలు దాగున్నాయి. అందుకే చాలామంది లెమన్ వాటర్ తాగుతారు. భారతదేశంలోని చాలా ప్రాంతాలలో ప్రసిద్ధి చెందిన పానీయం లెమన్ వాటర్ అయితే ప్రతిరోజూ ఉదయం నిమ్మరసం తాగడం వల్ల మీ స్థూలకాయం తగ్గడమే కాకుండా అనేక వ్యాధుల నుంచి మిమ్మల్ని దూరంగా ఉంచుతుందని సూచిస్తున్నారు. శరీరంలోని మలినాలు తొలగించడానికి, శరీరంపై ప్రతికూల ప్రభావాలు తొలగించడానికి నిమ్మరసం తాగాలి. దీనిలో ప్రోటీన్లు, కార్బోహైడ్రేట్లు, విటమిన్లు, ఖనిజాలు సమృద్ధిగా ఉంటాయి. ఇది మీ రూపాన్ని కూడా మెరుగుపరుస్తుంది. నిమ్మకాయ నీటిని తీసుకోవడం ద్వారా మీ ఆరోగ్యంపై ఎలాంటి సానుకూల ప్రభావం చూపుతుందో ఇప్పుడు తెలుసుకోండి.

మీరు కూడా మీ స్థూలకాయాన్ని తగ్గించుకోవాలనుకుంటే ఇది మీకు సులువైన మార్గం. ప్రతిరోజూ ఉదయం ఒక గ్లాసు గోరువెచ్చని నీటిలో నిమ్మరసం కలుపుకుని రోజుకు కనీసం రెండుసార్లు తాగండి. ఇంకా ప్రతి గంటకు ఒక గ్లాసు నీరు త్రాగండి. ఇది మీకు ఆకలిగా అనిపించకుండా తక్కువ తినడానికి సహాయపడుతుంది. ఎందుకంటే నీరు మీ శరీరాన్ని సమతుల్యంగా ఉంచడంతో పాటు మీ జీర్ణవ్యవస్థను కూడా సమతుల్యం చేస్తుంది.

ఆరోగ్యానికి నిమ్మరసం వల్ల కలిగే అతి పెద్ద ప్రయోజనం ఏమిటంటే ఇది మూత్రపిండాల్లో రాళ్ల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. కిడ్నీల్లో రాళ్ళు చాలా నొప్పిని కలిగించడంతో పాటు మూత్రాన్ని అడ్డుకుంటాయి. అటువంటి పరిస్థితిలో నిమ్మరసం తాగడం వల్ల శరీరాన్ని రీహైడ్రేట్ చేయడంలో సహాయపడటమే కాకుండా మూత్రపిండాల్లో రాళ్లను తొలగిస్తుంది.

రోజూ పళ్లు తోముకున్న తర్వాత కూడా కొంత సమయం తర్వాత నోటి దుర్వాసన రావడం ప్రారంభమవుతుంది. అటువంటి పరిస్థితిలో, ఖాళీ కడుపుతో నిమ్మరసం తీసుకోవడం ద్వారా మీరు ఈ సమస్య నుంచి బయటపడవచ్చు. ఎందుకంటే ఇందులో ఉండే విటమిన్ సి శ్వాసను తాజాగా ఉంచుతుంది. నోటిలో ఉండే బ్యాక్టీరియాను చంపుతుంది. రోజూ ఉదయం నిమ్మరసం తాగడం వల్ల జీర్ణశక్తి పెరుగుతుంది. ఇది కడుపు వ్యాధులకు కూడా ఉపయోగకరంగా ఉంటుంది. ఎందుకంటే ఇందులో ఫ్లేవనాయిడ్లు ఉంటాయి. ఇది జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఎసిడిటీ నుండి ఉపశమనాన్ని అందిస్తుంది.

అయితే, నిమ్మరసం నీరు అధిక చక్కెరతో కూడిన రసాలు, పానీయాలకు మంచి ప్రత్యామ్నాయంగా పరిగణిస్తారు. ముఖ్యంగా మధుమేహ వ్యాధిగ్రస్తులకు. ఎందుకంటే రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడం ద్వారా, ఇది శరీరాన్ని రీహైడ్రేట్ చేయడంతోపాటు శక్తినిస్తుంది.

# ఈ చిట్కాలను పాటిస్తే.. పట్టు చీరలకు డ్రై క్లీనింగ్ అక్కర్లేదు!



మారుతున్న కాలంతో మనం కూడా మారిపోతున్నామని అనుకుంటాం కానీ ఎన్ని రకాల డ్రస్సులు, లెహంగా లు, లంగా ఓణీలున్నా పట్టు చీరల ముందు అవన్నీ దిగదుడుపే. ప్రత్యేక ఫంక్షన్లు, పెళ్లిళ్లలో పట్టు చీరలను కట్టాల్సిన పద్ధతిలో కట్టుకుంటే ఆడవారిని చూసేందుకు రెండు కళ్లూ చాలవు. అంత అందంగా కనిపిస్తారు. మగువల అందాన్ని పట్టు చీరలు మరింత రెట్టింపు చేస్తాయి. కానీ ఒకటి, రెండుసార్లు కట్టుకోగానే అవి మురికి పట్టేస్తాయి. సాధారణ చీరలను ఉతికినట్టుగా పట్టు చీరలను ఉతకడం సాధ్యం కాదు. డ్రైక్లీనింగ్‌కు ఇవ్వాలంటే చాలా డబ్బు ఖర్చవుతుంది. ఇంట్లోనే కొన్ని సింపుల్ టిప్స్‌తో పట్టుచీరలను మీరే శుభ్రం చేసుకోవచ్చు. ఆ చిట్కాలేంటో ఇప్పుడు తెలుసుకోండి డబ్బు ఆదా చేసుకోండి.

**ఫస్ట్ చీరను ఉతకాలా? డ్రై క్లీనింగ్ ఇవ్వాలా? తెలుసుకోండి:**

పట్టు చీరను ఒకసారి కట్టిన తర్వాత కంటే నాలుగైదు సార్లు కట్టుకున్న తర్వాత ఉతకడం మంచిది. చీరను ఉతకాలనుపుడు దానిపై ఉండే లేబు ల్‌ను సరిగ్గా చదవాలి. డ్రైక్లీనింగ్ చేయాలా లేదా మామూలుగా ఉతికినా సరిపోతుందా అనేది దానిపై ఉంటుంది.

**పట్టు చీరలను చల్లటి నీటితోనే క్లీన్ చేసుకోవాలి:**

పట్టుచీరల్ని క్లీన్ చేసేటపుడు చల్లటి నీటినే వాడాలి. వేడి నీరు వాడితే చీర రంగు మొత్తం వెలసిపోయే అవకాశం ఉంది. చల్లటినీటిలో చీరను కొద్దిసేపు నానబెట్టాక సున్నితంగా ఉతకాలి.

**వెనిగర్‌తో శుభ్రం చేసుకోండిలా:**

పట్టుచీరను నీటిలో నానబెట్టిన తర్వాత ఒక బకెట్‌లో నీరు తీసుకుని అందులో 2 స్పూన్ల వైట్ వెనిగర్‌ను కలపాలి. అందులో పట్టుచీరను 10 నిమిషాలపాటు నానబెట్టాలి. ఆ తర్వాత శుభ్రమైన నీటితో శుభ్రం చేస్తే చీరపై మరకలు పోతాయి.

**పట్టు చీరలను పిండకూడదు:**

పట్టుచీరను ఉతికిన తర్వాత దానిని గట్టిగా పిండకూడదు. నీరు జారిపో యేంతవరకూ అలాగే ఉంచి ఆ తర్వాత నీడలో చీరను ఆరబెట్టాలి. ఎండ తగిలితే చీర మెరుపు పోతుందని గుర్తుంచుకోండి.

**పట్టు చీరలను ప్రత్యేకంగా ఉతకాలి:**

పట్టు చీరలను సాధారణ చీరలతో కలిపి ఉంచకూడదు. వాటిని ప్రత్యేక ప్రదేశంలో ఉంచి కాటన్ క్లాత్‌తో కవర్ చేసి ఉంచాలి. ఈ టిప్స్ పాటిస్తే మీ పట్టుచీరలు ఎప్పటికీ సురక్షితంగా కొత్తవాటిలా ఉంటాయి.

# అరటి పండు తింటే కలిగే ప్రయోజనాలు ...



అరటి పండు త్వరగా కడుపు నింపేస్తుంది. ఆకలిగా ఉన్నవారు ఆశ్రయించే పండు ఇదే. ఈ పండు ఎక్కువ శక్తినివ్వడంలో సహాయ పడుతుంది. ఎలాంటి అరటి పండులో ఎలాంటి పోషకాలు వున్నాయో తెలుసుకుందాము. పండిన అరటి పండులో ఎక్కువ మొత్తంలో యాంటీ ఆక్సిడెంట్లు, పీచు పదార్థాలు వుంటాయి. ఈ అరటి పండు త్వరగా జీర్ణమవడమే కాక వ్యాయామం చేసేవారికి తక్షణ శక్తినిస్తుంది.

పండిన అరటి పండులో వుండే యాంటీ ఆక్సిడెంట్లు కేన్సర్ కారకాలను నాశనం చేస్తాయి. బాగా పండిన అరటి పండులో తక్కువ మొత్తంలో విటమిన్లు, మినరల్స్ వుంటాయి. మగ్గిపోయిన అరటి పండులో ఎక్కువ మొత్తంలో చక్కెరలు, తక్కువ మొత్తంలో పీచు పదార్థాలు వుంటాయి. ఎన్ని నల్లటి మచ్చలు వుంటే అంత ఎక్కువ మొత్తంలో చక్కెరలు వున్నట్లు లెక్క. అరటి పండు తిని పడుకుంటే గంటలోపే నిద్రలోకి జారుకోవచ్చు.

# ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డుకు ఆర్థిక సహాయం అందించిన జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): పాడేరు పోలీస్ స్టేషన్ నందు హెూంగార్డు గా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ చేసిన ఎం. రామలింగం హెూంగార్డు కు ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో విధులు నిర్వహిస్తున్న హెూంగార్డులు ఒక రోజు డ్యూటీ అలవెన్స్ .3,86,240 రూపాయల- చెక్ ను తన కార్యాలయంలో జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

జిల్లా ఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ ఏఎస్ఆర్ జిల్లా, పాడేరు పోలీస్ స్టేషన్ హెూంగార్డుగా ప్రశంసాపూర్వకమైన విధులు నిర్వహిస్తూ, పోలీసు శాఖకు మెరుగైన సేవలు అందించారనీ ఈ సందర్భంగా హెూంగార్డు ఎం.రామలింగం ను అభినందించారు.ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో పనిచేస్తున్న హెూంగార్డు ఎవరైనా విధి నిర్వహణలో మరణించిన లేదా పదవీ విరమణ పొందిన వారికి ఆర్థికంగా ఆదుకునేందుకు అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లా లలో పనిచేస్తున్న హెూంగార్డులు అందరూ స్వచ్ఛందంగా వారికి వచ్చే ఒక రోజు డ్యూటీ అలవెన్స్ ను ఆర్థిక సహాయంగా అందజేయడం అభినందనీయమన్నారు.

ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన) బి.విజయ భాస్కర్, ఏ.ఓ బి.శారద, కార్యాలయ సిబ్బంది వరలక్ష్మి, రాజేష్ పాల్గొన్నారు.

# జెనీవాలో అంతర్జాతీయ కార్మిక సమ్మేళనంకు హాజరు కానున్న జగదీశ్వరరావు



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): జూన్ 3నుంచి 14 వరకు జెనీవాలో 112వ అంతర్జాతీయ కార్మిక సమ్మేళనం (ఐఎల్సీ) జరగనుంది. ప్రపంచంలో ఏటా జరగనున్న ఈ సదస్సుకు 191దేశాల కార్మిక మంత్రులు, కార్మిక సంఘాల నాయకులు, ప్రతినిధులు, యాజమాన్యాలు హాజరవుతుంటాయి. కీలక అంశాలపై చర్చలు జరిపి అఖరి రోజున పలు తీర్మానాలు చేసి వాటిని అన్ని దేశాల్లో అమలు పర్చడమే ధ్యేయంగా ఈ సమ్మేళనం జరగనుంది. భారతదేశం నుంచి అతి పెద్ద కార్మిక సంఘం అయిన భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) ఈ సదస్సుకు నాయకత్వం వహించనుంది. జెనీవా సదస్సుకు బీఎంఎస్ తరపున నలుగురు సభ్యులతో పాటు వివిధ కార్మిక సంఘాల నుంచి ఒకొక్కరు చొప్పున ఓ బృందంగా ఏర్పడి వెళ్ల నుంది. ఈ సమావేశానికి అఖిల భారత ఉపాధ్యక్షులు మళ్ల జగదీశ్వరరావుకు మళ్లీ అవకాశం దక్కింది. విశాఖ జిల్లా వాసి అయిన ఆయన గతంలో రెండు మార్లు హాజరైన విషయం తెలిసిందే. మరే ఇతర కార్మిక సంఘాల నుంచీ జగదీశ్వరరావు తరహా ఇప్పటి వరకూ ఎవరికీ ఇలా ఆహ్వానం అందలేని ఆ సంఘం నేతలు స్పష్టం చేశారు. ఇదిలా ఉంటే భారత దేశంలో కార్మికులెదు ర్కొంటున్న వివిధ సమస్యల్ని జెనీవా సదస్సులో జగదీశ్వరరావు ప్రస్తావించనున్నారని బీఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంవీఎస్ నాయుడు, రాష్ట్ర కార్యదర్శి కె.లోవారెడ్డి, కోశాధికారి లాలం ప్రసాద్, జిల్లా అధ్యక్షులు రొక్కం సురేష్, జిల్లా కార్యదర్శి ఎస్ఆర్పీ రాజశేఖర్, మండల కార్యదర్శి నరేంద్ర తదితరులు ఓ ప్రకటనలో తెలిపారు.

# 2024-25 విద్యా సంవత్సరానికి గాను అడ్మిషన్లు ప్రారంభం





విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): బీవీకే జూనియర్ కాలేజీ విశాలాక్షి నగర్ బ్రాంచ్ లో 2024-25 విద్యా సంవత్సరానికి గాను అడ్మిషన్లు ప్రారంభించినట్లు కాలేజీ యాజమాన్యం విలేకరుల సమావేశంలో ప్రిన్సిపల్ ఆచంట రమా మాట్లాడుతూ ప్రకృతి ఒడిలో, సువిశాలమైన ప్రాంగణంలో, చక్కటి లేబరేటరీ,లైబ్రరీ సదుపాయాలతో, పిల్లల బంగారు భవిష్యత్తు కోసం నిరంతరం కృషి చేసే అనుభవ్యులైన ఉపాధ్యాయ బృందంతో, అత్యుత్తమమైన విద్యా ప్రమాణాలతో, అందరికీ అందుబాటు ఫీసులతో అర్హత కలిగి ప్రవేశాల కోసం ఆసక్తి ఉన్న విద్యార్థినీ, విద్యార్థులు టీసీ, బర్త్, క్యాస్ట్ , ఆధార్ సర్టిఫికెట్లు, పాస్ పోర్టు సైజ్ ఫోటో, ఇంటర్ పదోతరగతి మార్కుల పట్టిక తదితర వివరాలతో కాలేజీ కార్యాలయంలో సంప్రదించాలని కోరింది. ఎంపీసీ, ఎంఈసీ, సీఈసీ, మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ, మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్ కోర్సులలో ప్రవేశాలకు విద్యార్థినీ, విద్యార్థులు కాలేజీ కార్యాలయంలో సంప్రదించాలని కోరింది.తమ కాలేజీలో చదివిన అనేకమంది ఉన్నత పదవుల్లో, ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని బీవీకే యాజమాన్యం తెలిపింది.

# ఘనంగా శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జన్మదిన మహెూత్సవం





అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): పట్టణంలోని ప్రసిద్ధి చెందినశ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం సంఘం లో వైశాఖ మాస శుద్ధ దశమి శనివారం ఆలయంలో శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జన్మదినం మహెూత్సవాల ఘనంగా జరిగాయి. తెల్లవారుజామున అమ్మవారి పల్లకి ఊరేగింపు శ్రీ అమ్మవారి నామ భజన సంకీర్తనలతో, మేళ తాళాములతో వైభవంగా తిరువీధి మహెూత్సవం జరిగింది. నిత్య ప్రార్థనలు, గోపూజ, శ్రీ నగరేశ్వర స్వామి శ్రీ జనార్ధన్ స్వామి వారికి అభిషేకాలు అర్చనలు నిర్వహించారు. ఆలయ ముఖ మండపంలో శ్రీ అమ్మవారి ఉత్సవమూర్తికి భక్తులచే ధాన్యాభిషేకం, శ్రీ అమ్మవారికి లక్ష మల్లెపూలతో అర్చన, సామూహిక లలిత సహస్ర నామ స్తోత్ర పారాయణం, పేద మహిళలకు చీరల పంపిణీ, అన్నదానం, అమ్మవారికి 102 రకాల స్వీట్లు తో నివేదిన, శ్రీ అమ్మవారికి ఊంజల్ సేవ, అమ్మవారి జీవిత చరిత్ర కోలాట నృత్యా నాటక రూప ప్రదర్శన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు బిళ్ళపాటి కృష్ణకుమార్, కార్యదర్శి, కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్ వుప్పల శ్రీనివాసరావు, భక్తులు తదిరులు పాల్గొన్నారు.

# జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ ఆధ్వర్యంలో వంశీకృష్ణ శ్రీనివాస్‌ని మర్యాద పూర్వకంగా కలిసిన జీవీఎంసీ పరిధిలో గల టిడిపి కార్పొరేటర్లు



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): జనసేన విశాఖ నగర అధ్యక్షులు, దక్షిణ నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్‌ని టిడిపి ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పలువురు కార్పొరేటర్లు శివాజి పాలెం క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కి సంబంధించిన మరియు రాబోవు రోజుల్లో చేపట్టాల్సిన పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో గంధం శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, గొలగాని వీరరావు, గొలగాని పోలరావు, రాజ శేఖర్, బల్లా శ్రీనివాస్, వరాహ నరసింహం, గోడి నరసింహ చారి, మొల్లి లక్ష్మణ్ రావు, తెడ్డు రాజుతో పాటు పలువురు టిడిపి సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# హర్యానాలో ఘోర బస్సు ప్రమాదం : 9 మంది సజీవదహనం!



హర్యానాలో ఘోర బస్సు ప్రమాదం జరిగింది. ఓ టూరిస్ట్ బస్సులో ఉన్నంటుండి ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. దీంతో ఆ బస్సులోనే 9 మంది సజీవ దహనమయ్యారు. మరో 24 మంది తీవ్ర గాయలపాలయ్యారు. రాష్ట్రంలోని కుండలలీ మనేసర్ పల్వాల్ ఎక్స్‌ప్రెస్ వే మీద ఓ టూరిస్ట్ బస్సు పూర్తిగా దగ్ధమైంది. ఒకే ఫ్యామిలీకి చెందిన 60 మంది ప్రయాణికులకు తీర్థయాత్రలకు వెళ్లి వస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఈ టూరిస్ట్ బస్సులో ఉన్నవారంతా ఉత్తరప్రదేశ్ లోని మధుర, బృందావన్ టూర్ కు వెళ్లి సొంతరాష్ట్రమైన పంజాబ్‌కు తిరుగు ప్రయాణమయ్యే క్రమంలో ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. ఈ టూరిస్ట్ బస్సులో మహిళలు, చిన్నారులు కూడా ఉన్నారు.

ఈ ఘోర ప్రమాదంలో 9మంది సజీవ దహనం కాగా, మరో 24మంది తీవ్రగాయాలపాలయినట్లు తెలుస్తోంది. బస్సు వెనుక నుంచి పొగ వచ్చి నెమ్మదిగా మంటలు చెలరేగాయి. అయితే, ఈ విషయం బస్సులో ఉన్నవారికి చాలా ఆలస్యంగా తెలిసింది. బైక్‌పై ప్రయాణించే ఓ వ్యక్తి ఈ విషయాన్ని గమనించి బస్సు డ్రైవర్‌కు చెప్పాడు. అయితే, అప్పటికే పరిస్థితి విషమించింది. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టి, మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అయితే, అప్పటికే చాలామంది మంటల్లో చిక్కుకున్నట్లు తెలుస్తోంది. ప్రమాదంలో గాయపడినవారిని నుహ్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

**తీర్థయాత్ర ముగించుకుని వస్తుండగా ప్రమాదం..**

పోలీసులు ఇచ్చిన పూర్తి సమాచారం మేరకు..పంజాబ్ చండీగఢ్?కు చెందిన 60మంది ప్రయాణికులకు తీర్థయాత్రలకోసం మధుర, బృందావన్?ను సందర్శించేందుకు ఓ టూరిస్ట్? బస్సులో బయలుదేరారు. అయితే, తమ సందర్శనను ముగించుకుని పంజాబ్‌కు తిరిగి వస్తున్న క్రమంలో నుహ్? జిల్లా తావడు పట్టణ సమీపంలోని కుండలీ మానేసర్ పల్వాల్? ఎక్స్?ప్రెస్?వే వద్దకు రాగానే ఒక్కసారిగా బస్సులో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో 9మంది ఆ మంటల్లో కాలి బూడిదవ్వగా, మరో 24 మంది తీవ్రంగా గాయపడ్డారని పోలీసులు తెలిపారు. గాయపడిన వారిని సమీప ఆస్పత్రికి తరలించామని, అయితే ఇంకా మృతులను గుర్తించలేదని పోలీసులు పేర్కొన్నారు.

# డీఈఓకు వినతిపత్రం సమర్పించింది : ఏపీటీఎఫ్



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): నాడు నేడు పనులకు సంబంధించి ఉపాధ్యాయులకు ఇచ్చిన సోకాజ్ నోటీసులను తక్షణం ఉపసంహరించుకోవాలని ఎ.పి.టి.ఎఫ్.,అనకాపల్లి జిల్లాశాఖ ప్రతినిధులు జిల్లా విద్యా శాఖాధికారిణి ని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు నాడు నేడు పనుల్లో గ్రౌండ్ లెవెల్లోగల సమస్యలు ఆమె దృష్టికి తీసుకువెళ్లారు.దీనిపైఈ అంశాన్ని అధికారులకు తెలియజేస్తామన్నారు. దీనికై ఆందోళన చెందవలసిన అవసరం లేదనీ డీఈవో వెంకటలక్ష్మి అన్నారు.


Sugar Free Fitearly | నడివయస్కులకు దివ్య శక్తి ఫిట్ ఎర్లీ | थकावट से सत्वर उपसमन फिट एर्ली

వివిధ వృత్తి, ఉద్యోగాలలో అలసటకు లోనై నీరసించి పోతున్నారా?

మందులు మింగలేక, చక్కెరతో కూడిన ఎనర్జీ బూస్టర్లు సేవించలేకపోతున్నారా?

దిగులు చెందకండి.

"ఫిట్ ఎర్లీ" మిమ్మల్ని నిరంతరం శక్తివంతం గాను, ఉత్సాహవంతంగాను ఉంచుతుంది.

సోయప్రోటీన్, వే ప్రోటీన్, బ్రాహ్మి, హరితకి, సీ భక్తారన్, శొంఠి, తులసి, అశ్వగంధ తదితర హిమాలయముల నుండి సేకరించిన విశిష్ట వన మూలిక సమ్మిళితమైన "ఫిట్ ఎర్లీ" విశిష్టానుభవం గల పరిశోధకులచే రూపొందించబడింది. అంతేకాక ప్రఖ్యాత వైద్యరంగ పరిశోధన శాలలో అన్ని విధములుగా పరీక్షించబడి సంతృప్తి కరమైన ఫలితాలను ప్రకటించుకోబడిన ఉపాహారం



ఆంధ్రప్రదేశ్‌లో డీలర్‌షిప్ వివరాలకు సంప్రదించండి
ఎస్.వీరభద్రరావు : సెల్: 8247526179
ఈ-మెయిల్: surampudi43@gmail.com

HERBINDO LABS PRIVATE LIMITED
HEALTH AND HAPPINESS
Compli

HERBINDO LABS PVT LTD.
2-2-642/1/1/1A, Sadguru Krupa,
Street No 16,
Amberpet, Hyderabad - 500013,
Telangana, India
E-Mail: herbindolabs@gmail.com
Mob: +91 9704885252
GSTN: 36AAECH6684G1ZA
CIN: U24100TG2018PTC127052

# నాటకం సజీవంగా ఉండాలి : మాజీ మంత్రి దాడి



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** శ్రీమతి జ్యోతి సరళ స్మారక కళా పరిషత్ వారు అనకాపల్లి రైతు భారతి చూస్తే ఓపెన్ ఎయిర్ థియేటర్ లో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఆహ్వానపు నాటికల పోటీలను సాయంత్రం 7 గంటలకు మాజీ మంత్రి దాడి వీరభద్రరావు జ్యోతి ప్రజ్వలన చేసి నాటక పరిషత్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ పరిస్థితి నిర్వాహకులు నాయుడు నాటక రంగం పట్ల ఉన్న మక్కువతో మూడేళ్లుగా నాటక పరిషత్తులు నిర్వహించడం అభినందనీయం అన్నారు. నాటకం సజీవంగా ఉండాలని ప్రతి ఒక్కరు నాటకాన్ని ప్రోత్సహించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాటక పరిషత్ నిర్వాహకులు కళాకారులైన పి సి హెచ్. నాయుడు. పి వి రామారావురంగస్థల నటి హైమ , మాజీ కౌన్సిలర్, కేఎం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

**ఆకట్టుకున్న నాటికలు....**

నాటికల పోటీల్లో ప్రదర్శించిన అమరావతి ఆర్ట్స్ గుంటూరు వారి అమృత హస్తం నాటిక ప్రేక్షకులను ఆకట్టుకుంది. నాటిక ఒక తల్లి కడుపున పుట్టిన అన్నాచెల్లెళ్ల ప్రేమ అనుబంధం చాలా గొప్పది ఆధునిక సమాజంలో మృగ్యమైపోతున్న ఇలాంటి బంధాలు ఎంత అవసరమో సమాజానికి గుర్తు చేయడం నాటిక ఇతి వృత్తం. ప్రేమించి పెళ్లి చేసుకున్న చెల్లెల్ని అష్ట కష్టాలు పడుతున్న భర్తని భరించి వారి కాపురం సజావుగా సాగడానికి అన్న ఎన్నో విధాలుగా ఆదుకుంటూ ఉంటాడు. చెల్లి రోగంతో బాధపడుతుంది చెల్లెలి బావని ఇంట్లో పెట్టుకుంటాడు అన్న. అన్న భార్య భర్త చేసిన పనిని తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. ఈ లోగా ఇంట్లో తిష్ట వేసిన చెల్లెలు భర్త ఒక్కోసారి ఒక్కో విధంగా డబ్బులు గుంజుతాడు చివరకు అన్న ఉన్న ఇంట్లో సగభాగాన్ని రాయించమని భార్యని వేధిస్తాడు. ఆధునిక టెక్నాలజీతో అతని మాటల్ని చేష్టల్ని బెదిరింపుల్ని హత్యాయత్నాన్ని అన్నిటిని రికార్డు చేసి చట్టం దృష్టిలో అతనికి ఇంత శిక్ష పడుతుంది అని అన్నా చెల్లెలు చెప్పగా ఆయన బావ హరి తలవంచుకొని వెళ్ళిపోతాడు. నాటికలో పాత్రధారులు పురుషోత్తం గా కావూరి సత్యనారాయణ హరిగా ఏపూరి హరి సుశీలగా సరిత మాలతిగా మాధవి పాత్రోచితంగా నటించి



తమ పాత్రలకు న్యాయం చేకూర్చారు. కావూరి సత్యనారాయణ రచించిన నాటికను ఏపూరి హరి దర్శకత్వం వహించారు . నాటిక కు తేజ సంగీతం అందించి సహకరించారు.

అలాగే గుంటూరుకు చెందిన శ్రీ కరణం సురేష్ మెమోరియల్ థియేటర్స్ సాంస్కృతిక కళా సంస్థ వారిచే ప్రదర్శించబడిన నాలోన నీవే నాటిక కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంది

## వైభవంగా శ్రీ గౌరీ పరమేశ్వరుల ఊంజల సేవ



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** స్థానిక గవరపాలెం లో ఉన్న శ్రీ గౌరీ పంచాయతన దేవస్థానం నందు శ్రీ గౌరీ పరమేశ్వరుల 192వ ఊంజల్ సేవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమము దేవాలయ అర్చకులు. అంపోలు గోపాల కృష్ణ శర్మ, పొందూరు సూర్య నారాయణ శాస్త్రి,శేషు, సాయి, వేదవిదులైన పండితులచే నిర్వహించబడింది. ఈ ఉంజల్ సేవలో పాల్గొన్న వేగి నాగేశ్వరరావు అనురాధ దంపతులు, కుటుంబ సభ్యులు, అతిథులు శ్రీ గౌరీ గీత మహిళా మండలి శ్రీ సత్తెమ్మ తల్లి దేవస్థానం మహిళా మండలి, శ్రీ గౌరీ పరమేశ్వరి అమృత వర్షిని పెంతకం శెట్టి సుజాత పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్ , అళ్ళ మహాలక్ష్మి నాయుడు, మళ్ల సురేష్, యల్లపు వెంకటరమణ, అళ్ల ప్రసాద్ పాలకవర్గ సభ్యులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని ఎంచుకోవాలి




**విజయనగరం:** విద్యార్థి దశలోనే ప్రతి ఒక్కరు లక్ష్యానించుకోవాలని వయోజన విద్య సంచాలకులు సోమేశ్వరరావు అన్నారు. శనివారం నాడు జిల్లా కేంద్ర గ్రంథాలయం నందు వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించిన ఆయన అనంతరం మాట్లాడుతూ పుస్తకాలన్నీ ఒకే చోట ఉన్న ప్రదేశాన్ని లైబ్రరీ అంటారన్నారు. లైబ్రరీయన్ నీ మనం ఎంత బాగా ఉపయోగించు కుంటే అంత బాగా పైకి ఉన్నత స్థితి చేరుకోగలమని అన్నారు. పుస్తక పట్నం అనేది రోజుకు రెండు మూడు గంటలు చదవాలన్నారు. పూర్వ చరిత్రలు తెలుసుకోవాలంటే సాంప్రదాయాలను సాంస్కృతిని తెలుసుకోవాలంటే పుస్తకాలే ఆధారం అన్నారు. వేసవి సెలవులను వృధా చేసుకోకుండా ప్రతి ఒక్కరు గ్రంథాలయం కొచ్చి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బి.లక్ష్మి మాట్లాడుతూ ఈ వేసవి శిక్షణ శిబిరాలు ఈనెల 15 నుంచి జూన్ 7వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణ శిబిరాల్లో పిల్లలకు కథలు చెప్పడం రాయడం వినడం వంటి అంశాలను నేర్పిస్తూ చిత్రలేఖనం క్రీడలు తెలుగు ఇంగ్లీష్ అదే విధంగా ఈ సంవత్సరం కొత్తగా కంప్యూటర్ శిక్షణ కూడా నేర్పించబడునని అన్నారు. వీటికి తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహించి రోజు గ్రంథాలయాలకు పంపించాలని కోరారు. గ్రంథాల ఏర్పాట్ల ఆవశ్యకతను తెలుసుకోవడానికి ప్రభుత్వం ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. చదువుతోపాటు విజ్ఞానం సమాజంలో ఏం జరుగుతుందో తెలుసుకోవడానికి గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడతాయి అన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ గౌస్ బాషా, గ్రంథాలయ సహాయధికారి కే శ్రీనివాసరావు, సీనియర్ రికార్డ్ అసిస్టెంట్ ఆచారి, ఇతర సిబ్బంది శ్రీనివాసరావు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## యూఏఈ పదేళ్ల బ్లూ రెసిడెన్సీ వీసా.. ఎవరికి ఇస్తారు? ఎలా దరఖాస్తు చేసుకోవాలి?




పర్యావరణ పరిరక్షణ, సుస్థిరతను ప్రోత్సహించేందుకు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ప్రభుత్వం పదేళ్ల చెల్లుబాటు అయ్యేలా బ్లూ రెసిడెన్సీ వీసాను ప్రారంభించింది. ఈ వీసా అందుకున్న వ్యక్తులకు పదేళ్ల నివాస అనుమతితోపాటు అక్కడి పర్యావరణ ప్రాజెక్టుల్లో భాగస్వాములయ్యే అవకాశం కల్పిస్తారు.

**ఎవరికి ఇస్తారు?**

సముద్ర జీవులు, భూ ఆధారిత పర్యావరణ వ్యవస్థలు, గాలి నాణ్యత, సుస్థిర సాంకేతికతలు, ఇతర రంగాలలో పర్యావరణ పరిరక్షణకు కృషి చేసిన వ్యక్తులకు ఈ బ్లూ రెసిడెన్సీ వీసాను అందిస్తారు. దరఖాస్తుదారులకు కనుక అనుమతి లభిస్తే యూఏఈలో పదేళ్లు ఉండొచ్చు. అంతర్జాతీయ సంస్థలు, కంపెనీలు, సంఘాలు, ఎన్జీవోలు, గ్లోబల్ అవార్డు విజేతలు, విశిష్ట కార్యకలాపాలు నిర్వహించేవారు, పర్యావరణంలో పరిశోధనలు చేస్తున్నవారు ఈ వీసా కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

**దరఖాస్తు ఎలా చేసుకోవాలి?**

ఫెడరల్ అథారిటీ ఫర్ ఐడెంటిటీ, సిటిజన్‌షిప్, కస్టమ్స్, పోర్ట్ సెక్యూరిటీ (ఐసీపీ) ద్వారా బ్లూ రెసిడెన్సీ వీసా కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. అంతేకాదు, దేశంలోని సమర్థులైన అధికారులు చేసిన నామినేషన్లు, ప్రతిపాదనలను కూడా ఫెడరల్ బాడీ ఆమోదించి బ్లూ వీసా అందిస్తుంది.

**పలు వీసాలు ఆఫర్ చేస్తున్న యూఏఈ**

యూఏఈ పలు వీసాలను జారీ చేస్తూ ఉంటుంది. వాటిలో రెండేళ్ల చెల్లుబాటుతో హోస్ట్ వీసా అందిస్తుండగా, 2019లో 'గోల్డెన్ వీసా'ను ప్రారంభించింది. ఆవిష్కర్తలు, వ్యవస్థాపకులు, సైన్స్, విజ్ఞానం వంటి రంగాల్లో ఉన్న వారితోపాటు పదేళ్ల చెల్లుబాటు వ్యవధి కలిగిన విద్యార్థుల కోసం ఈ వీసాను జారీచేస్తుంది. అలాగే, విదేశీ పెట్టుబడిదారులు, నిపుణుల కోసం 'గ్రీన్ వీసా'ను కూడా తీసుకొచ్చింది. దీనికి యజమాని స్పాన్సర్‌షిప్ అవసరం లేదు.

## కిర్గిస్థాన్‌లోని భారత విద్యార్థులు బయటకు రావొద్దు: కేంద్రం



కిర్గిస్థాన్ రాజధాని బిషెక్‌లో విదేశీ విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని దాడులు జరుగుతున్న నేపథ్యంలో భారత ప్రభుత్వం అక్కడ ఉంటున్న మనోళ్లను అప్రమత్తం చేసింది. ప్రస్తుతం అక్కడి ఆందోళనకర పరిస్థితి దృష్ట్యా భారత విద్యార్థులు ఎవరూ బయటకు రావొద్దని తెలిపింది. ఈ మేరకు అక్కడి భారత ఎంబసీ ఎక్స్ (ట్విటర్) వేదికగా కీలక సూచన చేసింది.

"మన స్టూడెంట్స్ తాలూకు సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నాం. ప్రస్తుతానికి పరిస్థితి ప్రశాంతంగానే ఉన్నప్పటికీ, విద్యార్థులు బయటకు రావొద్దు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే రాయబార కార్యాలయాన్ని సంప్రదించండి" అని ఎంబసీ ట్వీట్ చేసింది. అలాగే 24 గంటలు అందుబాటులో ఉండే 0555710041 అనే ఫోన్ నంబర్ కూడా ఇచ్చింది. ఈ నెల 13న ఈజిప్ట్, కిర్గిస్థాన్ విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణ తాలూకు వీడియోలు వైరల్ అయిన నేపథ్యంలో విదేశీ విద్యార్థులపై దాడులకు దారితీసినట్లు రాయబార కార్యాలయం పేర్కొంది.

## చంద్రగిరిలో కొనసాగుతున్న 144 సెక్షన్



**చంద్రగిరి:** ఏపీలో పోలింగ్ అనంతరం కొన్ని చోట్ల అల్లర్లు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. అయితే.. తిరుపతి జిల్లాలోని చంద్రగిరిలో 144 సెక్షన్ కొనసాగుతోంది. పోలింగ్ తర్వాత అలర్ల ఘటనకు సంబంధించి పోలీసులు ఇప్పటి వరకు 7కు పైగా కేసులు నమోదు చేశారు . ఇరు పార్టీలలో 40 మందికి పైగా ముద్దాయిలను పోలీసులు గుర్తించారు. పులివర్తి నానిపై దాడి కేసులో ఇప్పటికే 13మందిని అరెస్ట్ చేసి కడప సెంట్రల్ జైలుకు తరలించారు. పోలింగ్ రోజు బ్రాహ్మణ కాల్వలో బీఎస్ఎఫ్ జవాన్ 4 రౌండ్లు గాల్లోకి కాల్పులు జరిపారు. నానిపై దాడి సమయంలో మహిళా యూనివర్సిటీ స్ట్రాంగ్ రూమ్ దగ్గర నాని గన్ మాన్ 2 రౌండ్లు కాల్పులు జరిపారు. ఈ క్రమంలోనే.. నేతల ఇళ్ల వద్ద పోలీసుల బందోబస్తు కొనసాగుతోంది. అరెస్ట్ ల భయంతో కొందరు వైసీపీ, టీడీపీ కార్యకర్తలు అజ్ఞాతంలోకి వెళ్లినట్లు తెలుస్తోంది. వర్సిటీ వద్ద సీఐ పై దాడి ఘటనలో పాల్గొన్న వారిని గుర్తించే పనిలో ఉన్నారు పోలీసులు. నేటి మధ్యాహ్నం నుంచి సిట్ బఅందం విచారణ కొనసాగే అవకాశం ఉంది.

## కొన్ని సంఘటనలు అలా యాదృచ్ఛికంగా జరుగుతుంటాయి అని అపిస్తుంది!

### కానీ కొంచెం శ్రద్ధగా పరిశీలిస్తే ఒక దానితో ఇంకొకటి ముడి పడి ఉంటాయి!

1. అమెరికన్ స్టేట్ అసిస్టెంట్ సెక్రటరీ డోనాల్డ్ లు,దక్షిణ మరియు మధ్య ఆసియా వ్యవహారాలు 5 రోజుల పర్యటన కోసం భారత్ , శ్రీలంక,బాంగ్లాదేశ్ పర్యటనకి వచ్చాడు.

2. సరిగ్గా మే,10 న కేజ్రీవాల్ కి బెయిల్ వచ్చి విడుదల అయ్యాడు.

3.మే 9 న రష్యా విదేశాంగ శాఖ ప్రతినిధి మరియా జఖరోవా అమెరికా భారత పార్లమెంట్ ఎన్నికలలో జోక్యం చేసుకుంటున్నది అని విమర్శించింది!

4. డోనాల్డ్ లు భారత్ కి వచ్చే ముందే రష్యా ఆరోపణలు చేసింది అయితే జఖరోవా ఆరోపణల కి విలువ ఉంది!

**ఎవరీ డోనాల్డ్ లు?**

అమెరికా తరుపున దక్షిణ, మధ్య ఆసియా దేశాల లో ప్రభుత్వాలని అస్థిర పరిచే పనులు చేస్తుంటాడు!

పాకిస్థాన్ లో ఇమ్రాన్ ఖాన్ ప్రభుత్వము పడిపోవడానికి, పెట్టీ కేసులలో జైలుకి వెళ్లి ఎన్నికలలో నేరుగా పాల్గొనకుండా చేయడంలో డోనాల్డ్ లు ప్రముఖ పాత్ర వహించాడు!

పాకిస్థాన్ కి డాలర్లు కావాలి కాబట్టి అమెరికా చెప్పినట్లు నడుచుకుంది.

ఇది గత ఏడాది జరిగింది! అప్పట్లో డోనాల్డ్ లు పాకిస్థాన్ పర్యటన తరువాతే ఇమ్రాన్ ఖాన్ పతనం మొదలయ్యింది!

**అమెరికన్ జోక్!**

మరియ జఖరోవా ఆరోపణల మీద అమెరికన్ స్టేట్ డిపార్ట్మెంట్ ప్రతినిధి మాథ్యూ మిల్లర్ స్పందిస్తూ అమెరికా ఎప్పుడూ కూడా ఏ దేశ అంతర్గత ఎన్నికలలో జోక్యం చేసుకోలేదు.

భారత్ లో జరుగుతున్న ఎన్నికలు ఆ దేశ ప్రజలు నిర్ణయిస్తారు అందులో మా ప్రమేయం ఏమీ ఉండదు అని ప్రతిస్పందించాడు.

మరియా జాఖరోవా మరొక ఆరోపణ కూడా చేసింది.. భారత రాజకీయాలలో అస్థిరత నెలకొల్పడానికి డోనాల్డ్ లు భారత పర్యటన చేయబోతున్నాడు అని.

**నిజం కూడా అదే!**

కేజ్రీవాల్ నిర్వాకం ను పరిశీలిస్తే డోనాల్డ్ లు రాకముందే ఏదో గూడు పుఠానీ జరిగింది!

డోనాల్డ్ లు మే 10 న భారత్ లో అడుగుపెట్టాడు.

కేజ్రీవాల్ తీహార్ జైలు నుండి విడుదల అయిన గంటలోనే లిక్కర్ కేసులో బెయిల్ మీద ఉన్న సంజయ్ సింగ్ తో బహిరంగంగానే సమావేశం అయ్యాడు. ఇది బెయిల్ కండిషన్స్ ను ఉల్లంఘించడం అవుతుంది కానీ కేజ్రీవాల్ ఏ మాత్రం భయపడలేదు!

**ఏఏపీ రాజ్యసభ సభ్యురాలు స్వాతి మలీవాల్ !**

బెయిల్ మీద బయటికి వచ్చిన కేజ్రీవాల్ ను కలవడానికి వెళ్ళింది స్వాతి మాలీవాల్!

కేజ్రీవాల్ నివాసం లోని డ్రాయింగ్ రూమ్ లో కేజ్రీవాల్,భార్య సునీత, కేజ్రీవాల్ వ్యక్తిగత కార్యదర్శి అయిన బిబవ్ కుమార్ ఉన్నారు స్వాతి మలివాల్ వెళ్లిన సమయంలో.

ఏం జరిగిందో ఏమో కానీ కేజ్రీవాల్ పీఏ బిబవ్ కుమార్ స్వాతి మలీవాల్ జుట్టు పట్టుకొని కొట్టాడు.

అయితే స్వాతీ మలీవాల్ వెంటనే ఢిల్లీ పోలీసు కంట్రోల్ రూమ్ కి ఎమర్జెన్సీ కాల్స్ చేసింది రెండు సార్లు.

కొద్ది సేపటి తరువాత ఢిల్లీ పోలీసులు కేజ్రీ వాల్ నివాసానికి వచ్చి స్వాతీమలీవాల్ ను తీసుకెళ్లారు. ఇది అన్ని ప్రధాన మీడియాలలో వచ్చిన కథనం!

కానీ ఢిల్లీ లోని కొన్ని టాబ్లాయిడ్స్ మాత్రం కొంచెం ఎలాబొరేట్ చేసి వ్రాసాయి!

1. స్వాతి మలీవాల్ తో కేజ్రీవాల్ కి చాలా కాలం నుండీ సన్నిహిత సంబంధాలు ఉన్నాయి కాబట్టి రాజ్యసభ సీటు ఇచ్చాడు.

2. స్వాతి మలీవాల్ తన భర్త నవీన్ జైహింద్ కి విడాకులు ఇచ్చింది. ఒంటరిగా ఉంటున్నది.

3. సునీత కేజ్రీవాల్ కి స్వాతి మలీవాల్ అంటే ఇష్టం లేదు కాబట్టి బిబావ్ కుమార్ ను స్వాతి మీద దాడి చేయమని కోరింది!

4. మరో కథనం ప్రకారం తాను (కేజ్రీవాల్) మనీ లాండరింగ్ కేసులో జైలుకి వెళ్ళిన తరువాత స్వాతి మలీవాల్ మౌనంగా ఉంది తప్పితే ఎలాంటి నిరసన తెలపలేదు ఏపీపీ రాజ్యసభ సభ్యురాలి హోదాలో.అదీ కాక బెయిల్ మీద బయటికి వచ్చిన రెండు రోజుల తరువాత కలవడానికి వచ్చింది అని కోపంతో కేజ్రీవాల్ తన పీఏ బిబవ్ కుమార్ ను స్వాతి మీద దాడి చేయమని ఆదేశించాడు!

5. ఇంకొక కథనం ఏమిటంటే కేజ్రీవాల్ జైలుకి వెళితే తన భార్య సునీత కేజ్రీవాల్ ముఖ్యమంత్రి అవకుండా స్వాతి మలీవాల్ పోటీకి రావొచ్చు అనే అనుమానం బలంగా ఉందని కాబట్టి దాడికి ఆదేశించాడు కేజ్రీవాల్!

6. స్వాతి మాలీవాల్ అంటే కేజ్రీవాల్ కి ఇష్టం లేదు అని ఏఏపీ క్యాడర్ కి ఒక బలమయిన సందేశం ఇవ్వాలి అనే ఉద్దేశ్యం తో దాడి సంఘటన జరిగింది!

ఈ మొత్తం వ్యవహారంలో ఏం జరిగిందో, ఎందుకు జరిగిందో మరో ఆప్ రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్ కి తెలుసు కానీ మౌనంగా ఉండిపోయాడు ఎందుకంటే కేజ్రీవాల్ జైలుకి వెళితే ముఖ్యమంత్రి అవాలి అనే ఆశతో ఉన్నవాళ్లలో సంజయ్ సింగ్ కూడా ఉన్నాడు.

So! Donald Lu భారత్ పర్యటనకి వచ్చే ముందే కొన్ని పథకాలు రచించ బడ్డాయి లేకపోతే చాల సున్నితమయిన బెయిల్ కండిషన్స్ మీద బయటికి వచ్చిన కేజ్రీవాల్ ముఖ్యమంత్రి హోదాలో ఉండి తన పార్టీ రాజ్యసభ సభ్యురాలి మీద దాడికి దిగగలడా?

తాను ఏం చేసినా జూన్ 2 వరకూ తనకి ఏమీ కాదు అనే భరోసా ఎక్కడి నుండి వచ్చింది?

స్వాతి మలీవాల్ మాజీ భర్త నవీన్ జైహింద్ తన మాజీ భార్య అయిన స్వాతి మలీ వాల్ ప్రాణానకి ముప్పు ఉందని బహిరంగంగా ప్రకటించారు!

ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు!

Donald Lu వచ్చే ముందు , వచ్చిన తరువాత జరిగిన కొన్ని ప్రచారాలు వాటి తాలూకు ప్రభావం ఏమిటో చూద్దామా?

7. డోనాల్డ్ లు రాకముందు రాహుల్ చేసిన వ్యాఖ్య: బీజేపీ కి 180 సీట్లకు మించి రావు. కానీ తన పార్టీ కి ఎన్ని వస్తాయో చెప్పలేకపోయాడు.

8.4వ దశ ఎన్నికల తర్వాత కేజ్రీవాల్ చేసిన వ్యాఖ్య: బీజేపీ కి 220 కి మించి సీట్లు రావు.

8. రాహుల్ కి కేజ్రీవాల్ కి తేడా 40 సీట్లు.

9. ఎవరు రాసిస్తే వీళ్ళు ఈ లెక్కలు చెబుతున్నారు?

10. ఇక ఎక్స్ (ట్విట్టర్) లో కూడా బిజేపి కి మెజారిటీ రాదు అని కేవలం 180 సీట్ల దగ్గర ఆగిపోతుంది అని ప్రచారం జోరుగా చేస్తున్నారు కానీ ఈ ప్రభావం ఫేస్బుక్ బిజేపి అభిమానులలో కొంచెం నిరాసక్తిని కలుగచేసిన మాట వాస్తవం!

11. ఒక సిస్టమాటిక్ గా ఒక దాని తర్వాత ఇంకొకటి అనే విధంగా ప్రచారం చేస్తూ మానసికంగా దెబ్బ తీసే వ్యూహాన్ని అమలు చేస్తున్నారు!

12. ఇదంతా ఏ ఒక్కరి వల్లనో సాధ్యం కాదు! విదేశాలలో ఉన్న థింక్ టాంక్ ల గ్రూపులు కలిసి రచించిన వ్యూహం! గత రెండు ఏళ్లుగా కష్ట పడి ఈ రోజున దానిని అమలు చేస్తున్నారు! కొంత వరకూ విజయం సాధించారు అని చెప్పుకోవచ్చు!

Donald Lu రాక ముందు వచ్చిన తరువాత!

భారత స్టాక్ మార్కెట్!

ఈ నెల మొదటి వారంలో ఎఫ్‌డీఏ (Foriegn Direct Investments) లు మన స్టాక్ మార్కెట్ నుండి పెట్టుబడులు ఉపసంహరించింది 33 వేల కోట్ల రూపాయలు.ఇది ఒక నెల మొత్తంలో జరిగిన చరిత్ర ఉన్న 35 వేల కోట్ల రూపాయల తో పోలిస్తే డోనాల్డ్ లు రాకముందే జరిగిన సంగతి! అంటే బీజేపీ ఓడిపోబుతున్నది అనే ప్రచారము చేసి మార్కెట్ సెంటిమెంటును దెబ్బతీసారు.

అఫ్కార్స్! మళ్లీ పుంజుకున్నది అనుకోండి!

**మోడీజీ చాల ఆత్మ విశ్వాసంతో ఉన్నారు. అదే మనకి శ్రీరామరక్ష!**

సోషల్ మీడియాలో జరిగే దుష్ప్రచారం వలలో పడకుండా ఉంటే చాలు!

బీజేపీ మళ్ళీ అధికారం లోకి వస్తుంది!

మోడీ 3.0 లో చాలా వేగంగా,ఖచ్చితమైన నిర్ణయాలు తీసుకుంటారు!

# సినిమా



## దేవర.. అప్పుడే మరో లీక్ ఇచ్చేశారు!




యంగ్ టైగర్ ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో సిద్ధమవుతోన్న మూవీ దేవర. ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ ని మే 19న రిలీజ్ చేయబోతున్నారు. ఎన్టీఆర్ బర్త్ డే కానుకగా ఒక రోజు ముందుగానే దేవర ఫస్ట్ సింగిల్ తో ఫ్యాన్స్ కి ట్రీట్ ఇస్తున్నారు. అనిరుద్ రవిచందర్ ఈ చిత్రానికి మ్యూజిక్ అందిస్తున్నారు. మొదటి పాటగా ఫియర్ సాంగ్ ని రిలీజ్ చేస్తున్నారు. దీనికి సంబందించిన ప్రోమో కూడా వదిలారు. ఈ ప్రోమో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఈ సాంగ్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఆర్ఆర్ఆర్ తర్వాత సుదీర్ఘ గ్యాప్ తీసుకొని తారక్ దేవర మూవీ చేస్తున్నారు. అందుకే ఫ్యాన్స్ ఎగ్జైటింగ్ గా దేవర మూవీ అప్డేట్స్ కోసం వెయిట్ చేస్తున్నారు. దేవర మూవీ సాంగ్ విని ఫుల్ ఎనర్జీతో తారక్ బర్త్ డే సెలబ్రేషన్స్ చేయాలని ఫ్యాన్స్ భావిస్తున్నారు. ఇదిలా ఉంటే తాజాగా దేవర మూవీ సాంగ్స్ కి సంబంధించి లిరిక్ రైటర్ రామజోగయ్య శాస్త్రీ ఆసక్తికర ట్వీట్ చేశారు. ఒక్క రోజు వెయిట్ చేయండి. మన అనిరుద్ అబ్బా వర్తు వెయిటింగ్ అని అందరి నోటా అనిపిస్తాడు. రెండో పాట రికార్డింగ్ కోసం చెన్నై వచ్చా ఇది ఇంకో రకం ప్రకంపనం. అది కోత అయితే ఇది లేత అంటూ పరోక్షంగా సెకండ్ సాంగ్ ఎలా ఉండబోతోందనేది క్లారిటీ ఇచ్చాడు. అలాగే మొదటి సాంగ్ నెక్స్ట్ లెవల్ లో ఉండబోతోందని చెప్పి ఎక్స్ పెక్టేషన్స్ అమాంతం పెంచేశాడు. ఇక రెండో పాట డాన్స్ నెంబర్ గా ఉండబోతోందని రామజోగయ్య శాస్త్రీ ట్వీట్ బట్టి అర్ధమవుతోంది. తారక్, జాన్వీ కపూర్ మీద చిత్రీకరించిన రొమాంటిక్ సాంగ్ ని సెకండ్ సింగిల్ గా రిలీజ్ చేసే ఛాన్స్ ఉందని స్పష్టం అవుతోంది. ఈ సాంగ్స్ క్లిక్ అయితే మాత్రం దేవర మూవీ మీద అంచనాలు అమాంతం పెరిగిపోతాయి. గత ఏడాది జైలర్, లియో సినిమాలతో అనిరుద్ మ్యూజికల్ గా సూపర్ సక్సెస్ లు అందుకున్నాడు. అంతకు మించి దేవర ఉండాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. అనిరుద్ కూడా టాలీవుడ్ లో ఎలా అయిన సక్సెస్ కొట్టాలనే కసితో ఈ సారి మ్యూజిక్ చేస్తున్నట్లు తెలుస్తోంది. కొరటాల శివకి కూడా ఈ మూవీ చాలా కీలకంగా ఉంది. ఆచార్య లాంటి డిజాస్టర్ తర్వాత చేస్తోన్న సినిమా కావడంతో గ్యారెంటీగా బ్లాక్ బస్టర్ కొట్టాల్సిందే. అలాగే రాజమౌళితో మూవీ చేసిన తర్వాత మూడు సార్లు నెక్స్ట్ సినిమాలతో తారక్ ఫ్లాప్ లు అందుకున్నాడు. ఈ సారి మాత్రం ఆ సెంటిమెంట్ ని బ్రేక్ చేయాలని అనుకుంటున్నాడు.

## రాయణం మరో కొత్త ప్రయోగం..!




తమిళ స్టార్ నటుడు విజయ్ సేతుపతి హీరోగా వరుసగా సినిమాలు చేసే అవకాశాలు ఉన్నా కూడా విలక్షణంగా ఉండాలనే ఉద్దేశ్యంతో విలన్ పాత్రలను మరియు క్యారెక్టర్ ఆర్టిస్టుగా కూడా సినిమాలను చేస్తున్న విషయం తెల్సిందే. పాన్ ఇండియా స్టార్ నటుడు అంటూ విజయ్ సేతుపతి ఇప్పటికే మంచి గుర్తింపు దక్కించుకున్నాడు. అన్ని భాషల్లో కూడా విజయ్ సేతుపతి నటనకు, ఆయన పాత్రలకు అభిమానులు ఉన్నారు అనడంలో ఎలాంటి సందేహం లేదు. అలాంటి విజయ్ సేతుపతి త్వరలో 'ఏసీఈ' అనే విభిన్నమైన కాన్సెప్ట్ ఓరియంటెడ్ మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అవుతున్నాడు. ఉప్పెన సినిమాలో రాయణం పాత్రలో నటించడం ద్వారా తెలుగు ప్రేక్షకుల్లో చెరగని ముద్ర వేసిన విజయ్ సేతుపతి నటిస్తున్న ఈ సరికొత్త క్రైమ్ కామెడీ చిత్రం ఏసీఈ ను తెలుగు లో కూడా భారీ ఎత్తున విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆరుముగ కుమార్ దర్శకత్వంలో విభిన్నమైన కాన్సెప్ట్ తో రూపొందుతున్న ఈ సినిమాలో స్టార్ కమెడియన్ యోగి బాబు ముఖ్య పాత్రలో కనిపించబోతున్నాడు. ఇంకా అవినాష్, దివ్య పిళ్లై, బబ్లూ ఇలా ఎంతో మంది ప్రముఖ నటీనటులు విజయ్ సేతుపతి తో కలిసి సందడి చేయబోతున్నారు. బాలీవుడ్ లో కత్రీనా కైఫ్ తో కలిసి మేరీ క్రిస్మస్ సినిమాను చేసి ఆ మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చిన విజయ్ సేతుపతి ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను అలరించలేక పోయాడు. అయితే తన మార్క్ వినోదాన్ని మాత్రం విజయ్ సేతుపతి అందించాడు అంటూ నెటిజన్స్ అభిప్రాయం వ్యక్తం చేశారు. వెరైటీ టైటిల్‌తో పాటు చాలా వెరైటీగా ఉండి ప్రేక్షకులను అలరించే విధంగా క్రైమ్ కామెడీని తీసుకుని ఆరుముగ కుమార్ తీసిన ఈ సినిమా తప్పకుండా ప్రతి ఒక్క సినీ ప్రేక్షకుడిని ఆకట్టుకుంటుందని, ఈ కొత్త ప్రయోగం భాష తో సంబంధం లేకుండా అన్ని భాషల్లో ప్రేక్షకులను అలరిస్తుందని యూనిట్ సభ్యులు నమ్మకంగా చెబుతున్నారు. మరి ఉప్పెన రాయణం చేస్తున్న ఈ కొత్త ప్రయోగం ఎలాంటి ఫలితాన్ని దక్కించుకుంటుంది అనేది చూడాలి.

## ఈ అందాల రాణికి ఎన్ని కిరీటాలు ఇచ్చినా తక్కువే..



మిస్ వరల్డ్ 2017 విజేతగా, మోడలింగ్ నుంచి సినీ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన మానుషి చిల్లర్, తన సినీ ప్రస్థానంలో ఇప్పటివరకు పెద్దగా సక్సెస్ అందుకోలేకపోయింది. కానీ తన గ్లామర్ తో మాత్రం సోషల్ మీడియాలో ఎప్పటికప్పుడు హాట్ టాపిక్ గా మారుతూనే ఉంది. హరియాణాకు చెందిన ఈ అందగత్తె 17 సంవత్సరాల తర్వాత భారత్ నుంచి మిస్ వరల్డ్ కిరీటం గెలుచుకున్న వ్యక్తిగా చరిత్ర సృష్టించింది. బాలీవుడ్ లో 2022లో సామ్రాట్ పృథ్వీరాజ్ సినిమాతో వెండితెరకు పరిచయం అయిన మానుషి, మొదటి సినిమాతోనే భారీ ఫ్లాప్ ఎదుర్కొంది. అక్షయ్ కుమార్ తో కలిసి నటించిన ఈ చిత్రం, ప్రేక్షకులను నిరాశపరిచింది. ఆ తరువాత, "ది గ్రేట్ ఇండియన్ ఫ్యామిలీ" లో తన అదృష్టాన్ని పరీక్షించుకున్నా, ఈ చిత్రమూ బాక్సాఫీస్ వద్ద పరాజయం పాలైంది. తెలుగు ప్రేక్షకుల ముందుకు ఆపరేషన్ వాలెంటైన్ చిత్రంతో వచ్చినా, అనుకున్న స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది. వరుణ్ తేజ్ తో కలిసి చేసిన ఈ సినిమా కూడా ఆశించిన ఫలితాలను అందించలేదు. ఇక అమ్మడు సక్సెస్ ఫెయిల్యూర్ తో సంభంధం లేకుండా ముందుకు కొనసాగుతోంది. ఇక గ్లామర్ తో ఎప్పటికప్పుడు ఎట్రాక్ట్ చేస్తూనే ఉంది. రీసెంట్ గా ఇన్ స్టాగ్రామ్ లో స్టైలిష్ ఫొటోలతో ఎట్రాక్ట్ చేసింది. ఓ వైపు గ్లామర్ డోస్ మరోవైపు ట్రెడిషన్ లుక్కులో సూపర్బ్ అనేలా దర్శనమిచ్చింది. ఇక మనుషి కెరీర్ పరంగా మాత్రం బిగ్ హిట్ అందుకోవాల్సిన అవసరం ఉంది. ఇటీవల విడుదలైన "బడే మియాన్ చోటే మియాన్" సినిమాలో అక్షయ్ కుమార్, టైగర్ ష్రాఫ్ వంటి ప్రముఖులతో కలిసి నటించినా వర్కౌట్ కాలేదు. ఈ చిత్రంలో కూడా మానుషి తన నటనతో ప్రత్యేకమైన ముద్ర వేసుకోలేకపోయింది. కెప్టెన్ మిషా పాత్రలో స్టైలిష్ గా కనిపించినప్పటికీ, ప్రేక్షకుల మనసులను దోచలేకపోయింది. ఇప్పటి వరకు ఆమె చేసిన నాలుగు చిత్రాలు పెద్దగా విజయం సాధించకపోవడం, మానుషి కెరీర్ పై ప్రశ్నార్థకంగా మారింది. సోషల్ మీడియాలో ఈ విషయం వైరల్ అవుతూ, మాజీ మిస్ వరల్డ్ కు మొదటి హిట్ ఎప్పుడు దక్కుతుందోనని అభిమానులు చర్చిస్తున్నారు. సినిమాల ఎంపికలో మరింత జాగ్రత్తలు తీసుకోవాలని, నెక్స్ట్ మూవీతో సక్సెస్ సాధించాలని ఆమెకు సూచనలు వస్తున్నాయి. తెలుగులో కొన్ని అవకాశాలు మానుషి కి వచ్చినట్లు సమాచారం. భవిష్యత్తులో మానుషి చిల్లర్ తన నటనతో ప్రేక్షకులను ఎలా మెప్పిస్తుందో, తన తొలి విజయం ఎప్పుడు సాధిస్తుందో చూడాలి.

## హీరోయిన్ రష్మికకు కాంగ్రెస్ పార్టీ ఓపెన్ ఛాలెంజ్!



దేశవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల సందడి కొనసాగుతున్న వేళ సినిమా నటుల ఎంట్రీలు, రియాక్షన్‌లు వైరల్‌గా మారుతున్నాయి. ఈ సమయంలో తాజాగా "నేషనల్ క్రష్" రష్మిక... అటల్ సేతు వంతెనపై ఒక వీడియో చేయడం.. అభినందించడం.. ఆ వీడియోపై మోడీ & కో రియాక్ట్ అవ్వడం తెలిసిందే. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ రియాక్ట్ అయ్యింది. అవును... ముంబై ట్రాన్స్ హార్బర్ లింక్ దాదర్ నుండి నవీ ముంబైకి రెండున్నర గంటల ప్రయాణాన్ని కేవలం 20 నిమిషాలకు తగ్గించిందంటూ రష్మిక మందన్న చేసిన వీడియో & కామెంట్స్ పై స్పందించిన కాంగ్రెస్ పార్టీ.. సీరియస్‌గా రియాక్ట్ అయ్యింది. ఈ సందర్భంగా కొన్ని వాస్తవాలను ప్రస్థావిస్తూ... అదే వంతనపై మరో వీడియో చేయాలని సవాల్ చేసింది. ఈ సందర్భంగా... అటల్ సేతుపై ప్రశంసలు కురిపించిన రష్మిక మందన్నకు కేరళ కాంగ్రెస్ పార్టీ కౌంటర్ ఇచ్చింది. ఇందులో భాగంగా... ఇప్పటి వరకు పెయిడ్ యాడ్స్, సర్రోగేట్ యాడ్స్ మాత్రమే చూశామని, ఇప్పుడు తాజాగా ఈడీ డైరెక్షన్‌లో వచ్చిన యాడ్ ను చూస్తున్నామంటూ ఎద్దేవా చేసింది. ఇదే సమయంలో మీరు షేర్ చేసిన వీడియోలో అటల్ సేతు ఖాళీగా ఉన్నట్లు గమనించామని వివరించింది. ఇదే సమయంలో... కేరళ నుంచి వచ్చాం కాబట్టి, ముంబైలో ట్రాఫిక్ తక్కువగా ఉందని భావించాం.. ఇదే విషయాన్ని ముంబై కాంగ్రెస్ మిత్రులను అడిగి తెలుసుకునే ప్రయత్నం చేశాం.. అటల్ సేతు తో పోల్చితే రాజీవ్ గాంధీ బాంద్రా-వర్లీ సీ లింక్ ను వాహనదారులు ఎక్కువగా ఉపయోగిస్తున్నట్లు చెప్పారు. కావాలంటే ఈ వీడియో చూడండి.. అంటూ ఒక వీడియోను ఎక్స్ లో పోస్ట్ చేసింది కాంగ్రెస్ పార్టీ. ఈ సందర్భంగా వీడియో ఒక్కటే కాదు.. కొంత డేటాను కూడా పరిశీలించామని మొదలుపెట్టిన కేరళ కాంగ్రెస్... రూ.1,634 కోట్ల వ్యయంతో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన 5.6 కి.మీ బాంద్రా-వర్లీ సీ లింక్ ను 2009లో ప్రారంభించారు. ఎలాంటి షో ఆఫ్ లేకుండా ప్రారంభించబడిందంటూ వాహనదారులు ఆసక్తి చూపిస్తున్నారని తెలిపింది. ప్రతి కారుకు కేవలం రూ.85 వసూలు చేస్తున్నట్లు తెలిపింది. ఇదే క్రమంలో... అటల్ సేతును రూ.17,840 కోట్ల వ్యయంతో నిర్మించారని గుర్తు చేసిన కాంగ్రెస్ పార్టీ... ఒక్కో కారుకు ఒక్క ట్రిప్ కు రూ.250 టోల్ వసూళు చేస్తున్నారని.. ఈ ధర కామన్ మేన్ భరించే పరిస్థితి లేదని.. జనవరి 12న ఈ బ్రిడ్జి ప్రారంభం కాగా, ఏప్రిల్ 23 వరకు రూ.22.57 కోట్లు టోల్ వసూళు అయ్యిందని.. అంటే నెలకు రూ. 6.6 కోట్లు వసూళు అవుతుందని వివరించింది. ఈ నేపథ్యంలో... నెలకు రు. 6.6 కోట్ల లెక్కన చూసుకుంటే రూ.17,840 కోట్ల పెట్టుబడిని తిరిగి పొందేందుకు సుమారు 225 సంవత్సరాలు పడుతుంది.. ఇక వడ్డీకి లెక్కే లేదని స్పష్టం చేసింది. అటల్ సేతు నుంచి నెలకు రూ. 30 కోట్లు వస్తుందని భావించారని.. ఇప్పుడు అంత రావడం లేదని.. ముంబై వాసులు ఈ బ్రిడ్జిని ఎందుకు ఉపయోగించట్లేదో ఓ వీడియో చేస్తే బాగుంటుందంటూ రాసుకొచ్చింది.

## టిల్లు గాడి సౌండ్ రౌడీ స్టార్ ని దాటేసిందా...?



టాలీవుడ్ లో సక్సెస్ కోసం దశాబ్ద కాలం పాటు పోరాటం చేసిన సిద్దు జొన్నలగడ్డకు 'డీజే టిల్లు' రూపంలో ప్రతిఫలం దక్కింది. ఆ సినిమా తర్వాత సిద్దు పై ఆఫర్ల వర్షం కురిసింది. అయితే సిద్దు మాత్రం ఆచితూచి వ్యవహరిస్తూ వచ్చాడు. ఇటీవలే టిల్లు స్క్వేర్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చి మరో విజయాన్ని సొంతం చేసుకున్నాడు. ఈజీగా వంద కోట్ల వసూళ్లు రాబట్టిన సిద్దు జొన్నలగడ్డ అంటూ మీడియాలో తెగ ప్రచారం జరిగింది. యూత్ లో విపరీతమైన క్రేజ్ ను సొంతం చేసుకున్న సిద్దు జొన్నలగడ్డ పారితోషికం విషయంలో పైపైకి వెళ్తున్నాడు. ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తున్న ప్రచారం ప్రకారం అప్పుడే రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ పారితోషికంను సిద్దు క్రాస్ చేశాడట. ఖుషి సినిమాకు రూ.12 కోట్లు, ఫ్యామిలీ స్టార్ కు రూ.15 కోట్ల పారితోషికంను విజయ్ దేవరకొండ తీసుకున్నాడు అనేది ఆ సమయంలో వచ్చిన వార్తల సారాంశం. ఇప్పుడు సిద్దు జొన్నలగడ్డ టిల్లు క్యూబ్ తో పాటు కొత్తగా కమిట్ అవ్వబోతున్న సినిమాలకు రూ.15 కోట్లకు మించి కోట్ చేస్తున్నాడట. బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో చేస్తున్న జాక్ తో పాటు నీరజ కోన తో కలిసి చేస్తున్న ప్రాజెక్ట్ లు పూర్తి అయ్యి మంచి విజయాన్ని సొంతం చేసుకుంటే ఇదే ఏడాది సిద్దు పారితోషికం రూ.20 కోట్లకు వెళ్లినా ఆశ్చర్యం లేదు అన్నట్లుగా సినీ వర్గాల వారు మాట్లాడుకుంటున్నారు. పారితోషికం భారీగా పెంచినా కూడా సిద్దు జొన్నలగడ్డ వెంట ప్రముఖ నిర్మాతలు పడుతున్నారు. ఇప్పటికే కమిట్ అయిన సినిమాలు కాకుండా కొత్తగా కమిట్ అవ్వబోతున్న సినిమాలన్నింటికి కూడా భారీగా పారితోషికంను సిద్దు జొన్నలగడ్డ డిమాండ్ చేస్తున్నాడు అంటూ ఇటీవల ఒక నిర్మాత జర్నలిస్ట్ లతో చిట్ చాట్ లో చెప్పుకొచ్చాడు. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి అన్నట్లుగానే వరుసగా విజయాలు పడ్డప్పుడే పారితోషికం పెంచాలి అనేది ఇండస్ట్రీలో ప్రతి ఒక్కరు ఫాలో అయ్యే సూత్రం. కనుక పారితోషికం పెంపు విషయంలో సిద్దు జొన్నలగడ్డ ను విమర్శించడానికి ఏమీ ఏదు. ముందు ముందు ఆయన నుంచి మరిన్ని మంచి సినిమాలు వస్తాయని అభిమానులు ఆశిస్తున్నారు. అందుకోసం సిద్దు మరింత కష్ట పడటం ఖాయం. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే విధంగా టిల్లు క్యూబ్ ఉంటే చాలు.. సిద్దు స్థాయి ట్రిపుల్ అవ్వడం ఖాయం. బొమ్మరిల్లు భాస్కర్ తీస్తున్న జాక్ విషయంలో మొదట్లో కొంత అనుమానాలు ఉన్నా.. ప్రస్తుతం ఆసక్తి పెరుగుతోంది. విడుదల వరకు మంచి బజ్ క్రియేట్ అయ్యేలా సిద్దు ప్రమోట్ చేసి తీరుతాడు అంటూ సినీ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# ఏపీలో బాటిళ్లలో పెట్రోల్ విక్రయాలపై నిషేధం



ఏపీలోని పెట్రోల్ బంకుల్లో బాటిళ్లలో పెట్రోల్, డీజిల్ విక్రయించకుండా ఎన్నికల అధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. వాస్తవానికి బాటిళ్లలో పెట్రోల్, చమురు ఉత్పత్తుల బహిరంగ విక్రయంపై నిషేధం ఉన్నా క్షేత్రస్థాయిలో అది అమలు కావడం లేదు. ఇప్పుడు రాష్ట్రంలో తాజా పరిణామాల నేపథ్యంలో అధికారులు దీనిపై కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించారు. దీంతో పెట్రోల్ బంకులకు తాజా ఆదేశాలు వెళ్లాయి.

ఏపీలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో చోటు చేసుకుంటున్న పరిణామాలు సాధారణ ప్రజలను సైతం భయభ్రాంతుల్ని చేస్తున్నాయి. ముఖ్యంగా పోలింగ్ రోజు నుంచే పల్నాడు, రాయలసీమ ప్రాంతాల్లో చోటు చేసుకున్న హింసాత్మక ఘటనలు తీవ్ర కలకలం రేపాయి. అందులోనూ పల్నాడు ప్రాంతాల్లో పెట్రోల్ బాంబులు విసురుకోవడం, నిల్వ చేయడం వంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి. దీంతో ఈసీ పెట్రోల్ ను బాటిళ్లలో అమ్మకుండా నిషేధం విధించింది.

రాష్ట్రంలో ఎన్నికల తదనంతర హింసపై ఇప్పటికే ఈసీ ఆగ్రహంగా ఉంది. రాష్ట్రంలో హింసపై సమగ్ర విచారణకు సిట్ ను కూడా నియమించింది. ఇవాళ, రేపట్లో పల్నాడు, రాయలసీమలో హింసాత్మక ఘటనలపై దర్యాప్తు పూర్తి చేసి ఈసీకి సిట్ నివేదిక కూడా ఇవ్వబోతోంది. ఇవాళ మధ్యాహ్నం క్షేత్రస్థాయిలో దర్యాప్తు కోసం సిట్ అధికారులు వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో పెట్రోల్ బాటిళ్లలో విక్రయించకుండా చూడాలని పెట్రోల్ బంకుల యజమానులకు ఆదేశాలు వెళ్లినట్లు తెలుస్తోంది.

# కడప గౌస్‌నగర్ ఘటనపై ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఆగ్రహం



కడప: పోలింగ్ రోజున కడప గౌస్‌నగర్‌లో ఇరు వర్గాల మధ్య రాళ్ల దాడులు జరిగిన ఘటనపై ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో ఉన్న సీఐ, ఐదుగురు ఎస్ఐలకు ఛార్జ్ మెమో జారీ జారీ చేశారు. కడప వన్‌టౌన్ సీఐ భాస్కర్‌రెడ్డి, ఎస్ఐలు రంగస్వామి, తిరుపాల్ నాయక్, మహమ్మద్ రఫీ, ఎర్రన్న, అలీఖాన్‌కు ఛార్జ్ మెమోలు పంపించారు. వీరందరిపైనా శాఖాపరమైన విచారణకు ఆదేశించారు. పూర్తి స్థాయి విచారణ అనంతరం చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

మే 13వ తేదీన కడప నగరంలోని గౌస్‌నగర్‌లో వైసిపి, టిడిపి కార్యకర్తల మధ్య జరిగిన రాళ్ల దాడి ఘటనను పోలీసుశాఖ తీవ్రంగా పరిగణించింది. టిడిపి కార్యకర్తలపై దాడులకు తెగబడేలా వైసిపి కార్యకర్తలను మంత్రి అంజద్‌బాషా కుటుంబ సభ్యులు రెచ్చగొడుతూ భయానక వాతావరణం సృష్టించారు. ఈ నేపథ్యంలో పోలీసులు ఎవరినీ నిలువరించలేదనే విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ ఘటనపై ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ శనివారం సమీక్ష నిర్వహించారు. ఆ రోజు విధుల్లో ఉన్న అధికారులందరికీ ఛార్జి మెమోలు దాఖలు చేశారు. కౌంటింగ్ రోజున కూడా అల్లర్లు జరిగే అవకాశం ఉండటంతో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా పోలీసులను ఎస్పీ ఆదేశించారు.

# కొత్త ఎస్పీల నియామకంపై ఈసీ కీలక నిర్ణయం..!

ఏపీలో మూడు జిల్లాలకు కొత్త ఎస్పీలను నియమించారు. ఎన్నికల సంఘం సూచనల మేరకు ఏపీ ప్రభుత్వం వీరి నియామకం పైన ఉత్తర్వులు జారీ చేసింది. సార్వత్రిక ఎన్నికలకుపోలింగ్ ముగిసిన తర్వాత పల్నాడు, అనంతపురం, తిరుపతి జిల్లాల్లో అల్లర్లు జరిగాయి. దీంతో ఎన్నికల కమిషన్ వెంటనే చర్యలు చేపట్టి మూడు జిల్లాల్లో ఉన్న ఎస్పీలను బదిలీ చేసింది. దీంతో ఈ పోస్టులు ఖాళీ అయ్యాయి. ఎస్పీ స్థాయి ఐపీఎస్ అధికారులు లేరని.. మూడు పోస్టులకు ఏపీ ప్రభుత్వం ఐదుగురు పేర్లతో కూడిన ప్యానల్‌ను పంపించింది.

ఈ జాబితాలో ఎన్నికల సంఘం ఖరారు చేసిన పేర్లతో మూడు జిల్లాలకు ఎస్పీలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అనంతపురం జిల్లా ఎస్పీగా గౌతమీ శాలి , తిరుపతి ఎస్పీగా హర్షవర్ధన్, పల్నాడు జిల్లా ఎస్పీగా మలికా గార్గ్‌ను నియమించారు. అదే విధంగా పల్నాడు జిల్లా కలెక్టర్‌గా శ్రీకేష్ బాలాజీ ని నియమించారు. ఈనెల 13న జరిగిన పోలింగ్ రోజు, తరువాత జరిగిన మూడు జిల్లాలో జరిగిన హింసాత్మక ఘటనలను సీరియస్‌గా తీసుకున్న కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర చీఫ్ సెక్రటరీ, డీజీపీల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేసింది.

ఘటనలపై వెంటనే స్వయంగా వచ్చి నివేదికలను అందజేయాలని ఆదేశించిన మేరకు సీఎస్ జవహర్‌రెడ్డి, డీజీపీ హరీష్ కుమార్ ఢిల్లీకి వెళ్లి నివేదికను అందజేశారు. సీఈసీ ఆదేశాల మేరకు పల్నాడు కలెక్టర్‌ను, మూడు జిల్లాల ఎస్పీలను బదిలీ చేయడంతో ఖాళీ అయిన పోస్టులలో కొత్తవారిని నియమించింది. మూడు జిల్లాలకు నియమించాల్సిన అధికారుల విషయంలో ఈసీ సూచనల మేరకు మూడు పోస్టులకు ఏపీ ప్రభుత్వం ఐదుగురు పేర్లతో కూడిన ప్యానల్‌ను పంపించింది. ఎన్నికల పరిశీలకుడి పైన వైసీపీ ఫిర్యాదు పై విచారణ ప్రారంభం అయినట్లు తెలుస్తోంది.

# ఓట్ల లెక్కింపు కొరకు పక్కా ఏర్పాట్లు



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** సాధారణ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా, సజావుగా నిర్వహించిన విధంగానే ఈ వి ఎమ్ ల ఓట్ల లెక్కింపునకు అవసరమైన ఏర్పాట్లను పక్కా ప్రణాళికతో చేపట్టాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు.ఉద్యాన కళాశాలలోని మూడంచెల భద్రత, ఓట్ల లెక్కింపు కొరకు కల్పించవలసిన భద్రత, వసతుల ఏర్పాట్లను ఎస్ పి విక్రాంత్ పాటిల్ తో కలసి శనివారం పరిశీలించారు. అధిక సంఖ్యలో లెక్కింపు కేంద్రం బయట జనాలు చేరుకొనే అవకాశం ఉన్నందున భారీ వాహనాలను అనుమతించకుండా దారి మళ్లించేందుకు సూచనలు చేశారు. ఎంట్రన్స్ మార్గం దగ్గర గుర్తింపు కార్డులు కలిగిన సాధారన ఏజెంట్లను మాత్రమే అనుమతించేలా పోలీస్ సిబ్బంది నియామకం, బారికేడ్లను ఏర్పాటు అంశాలపై కలెక్టర్, ఎస్ పి చర్చించారు. ఈ వి ఎమ్ ల స్ట్రాంగ్ రూమ్ భద్రతను పరిశీలించిన అనంతరం, లెక్కింపు కేంద్రం వద్ద ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలను తీసుకోవాలని అధికారులను సూచించారు.

పార్లమెంట్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు గదులను సిద్ధం చేసి నివేదిక అందజేయాలని ఇన్చార్జి డి అర్ ఓ కేశవ నాయుడును ఆదేశించారు. కంట్రోల్ రూమ్ నుంచి స్ట్రాంగ్ రూమ్ ల వద్ద పోలీస్ పహారాను పర్యవేక్షించారు. జూన్ 4 వ తేదీ లెక్కింపు ముందు రోజు కౌంటింగ్ కేంద్రం సమీపంలోని గ్రామ ప్రజలు బయట ప్రాంతవాసులకు ఆశ్రయం కల్పించ వద్దని గ్రామాల్లో దండోరా వేయించాలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ డా ఓ.దిలీప్ కిరణ్, కంట్రోల్ రూమ్ ఓ ఎస్.డి. అర్.వి.సూర్యనారాయణ, పార్వతీపురం అసెంబ్లీ నియోజక రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ కె.హేమలత, దిశా పోలీస్ స్టేషన్ డిఎస్పి, పాలకొండ డిఎస్పీ ఎస్.అర్. హర్షిత, జి.వి. కృష్ణారావు, పోలీస్ భద్రతా సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఆదరణ కరువవుతున్నసాంప్రదాయ ఉప్పు పంట

## దుర్భరజీవితం గడుపుతున్న ఉప్పు కార్మికులు







**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** నేటి ఆధునీకరణ ప్రపంచం లో పరిశ్రమల ద్వారా తయారు చేస్తున్న ఉప్పు వల్ల సాంప్రదాయ తయారీ ఉప్పు పంటకు సమాజం లో ఆదరణ కరువయ్యింది. ఫలితం గా సాంప్రదాయ ఉప్పును పండిస్తున్న కార్మికుల జీవితాలు దుర్భరం అయ్యాయి. భీమిలి మండలం లో సముద్రం ఒడ్డున ఉన్న మూలకుద్దు గ్రామం ఉప్పు తయారీ కీ పెట్టింది పేరు. అనాదిగా పరిసర ప్రాంతాల ప్రజలు ఉప్పు తయారీ పై ఆధారపడి జీవనం సాగించెడి వారు.2009 వరకు చిట్టివలస జ్యూట్ మిల్ లాకౌట్ అయ్యే వరకు చాలామంది జ్యూట్ కార్మికుల కుటుంబాలు ఖాళీ సమయాల్లో ఉప్పును పండించెడి వారు.

**ఉప్పు తయారీ విధానం** : సముద్రం ఒడ్డున సుమారు 100 ఎకరాల్లో మడులు కట్టి ఆ మడులలో మోటారుల ద్వారా సముద్రపు నీటిని తోడి నీటిని నిల్వ చేస్తారు. కేవలం సూర్య రశ్మి,ఎండవేడిమి తో ఆ ఉప్పు నీరు ఇగిరి ఉప్పు తయారు అవ్వడం ఆరంభం అవ్వుతుంది.అలా తయారయిన ఉప్పును కార్మికులు బుట్టలు, కావిడలతో ఎత్తి ఒడ్డుకు చేరుస్తారు. అనంతరం వాటిని గుట్టలు గా ఉంచి వాటికి దుమ్ము, ధూళి చేరకుండా పూర్తిగా టార్పాలిన్ కవర్ల తో కప్పుతారు.అనంతరం వాటిని వివిధ ప్రాంతాలకు తరలించి విక్రయిస్తుంటారు.ఇలా తయారైన ఉప్పు ఇండ్ల లోవాడుక, సీ ఫుడ్స్ నిలవ, పశువులకు, కోళ్ల దాణాకు , కొబ్బరి పంటకు వినియోగిస్తారు.సహజం గా ఉప్పు తయారీ కి అక్టోబర్ నుండి మార్చి ఏప్రిల్ వరకు కొనసాగిస్తారు.

**ప్రస్తుత పరిస్థితి** : రాను రాను ఉప్పు తయారీకి ప్రత్యామ్నాయం గా కుటీర పరిశ్రమ ల ద్వారా రిఫైండ్ సాల్ట్, అయోడైజ్డ్ సాల్ట్, రసాయినాల తోకూడిన సాల్ట్ లు తయారు కావడం తో నేటి సమాజం లో సాంప్రదాయ ఉప్పు తయారీకి ఆదరణ తగ్గింది.ఫలితం ఉప్పు కార్మిక కుటుంబాలు ఉప్పు పంట పై గిరాకీ లేక, పెట్టిన పెట్టుబడి చేతికి అందక ఉప్పు ను తయారు చేయలేక చేతులెత్తేస్తున్నారు.

**లీజు దారులచే ఉప్పు తయారీ** : మూలకుద్దు గ్రామ ప్రజలు ఉప్పు తయారీని వదులు కోవడంతో మండలం లో రేఖవాని పాలెం, బ్యాంక్ కోలనీ తదితర ప్రాంతాలలో వివిధ పనులు చేస్తున్న కొంతమంది ఉప్పమడులను లీజుకు తీసికొని ఎకరాకు సుమారు 50 వేల రూపాయిల పెట్టుబడిని పెట్టి ఉప్పు ను తయారు చేస్తున్నారు.వీరు పండించిన ఉప్పు50 కేజీల బస్తా సుమారు 350 రూపాయిలు వరకు ఉంది.అయితే రానురాను 450 రూపాయిలకు కూడా అమ్ముడు పోతుందని ఉప్పు కార్మికులు అంటున్నారు.అయితే ఇక్కడ పండించిన ఉప్పు కు కూడా పూడిమడక తదితర సముద్ర తీర ప్రాంతాల్లో తయారు అవుతున్న ఉప్పు పంట వల్ల ఇక్కడ కార్మికులు తీవ్ర పోటీ ఎదుర్కొంటున్నారు. దీనితో వారు గిట్టుబాటు ధర రాకుండా ఉప్పును పండించలేమని చేతులెత్తేస్తున్నారు.

**ఉప్పు గుట్టలకు వర్షం దెబ్బ** : ఇప్పటికే తయారు చేసి గుట్టలు గా పోసిన ఉప్పునకు బుధవారం కురిసిన వర్షం దెబ్బతీసింది ఫలితంగా చాలావరకు ఉప్పు నీట కరిగి ఉప్పు కార్మికులకు కన్నీరు మిగిల్చింది.

**సాంప్రదాయ ఉప్పు తయారీని కుటీర పరిశ్రమ గా గుర్తించాలి** : నేడు మార్కెట్ లోపరిశ్రమల ద్వారా వివిధ బ్రాండ్ల పేరుతో తయారవుతున్న ఉప్పు ప్రోత్సహించడం వల్ల అతి ప్రాచీణమైన, సాంప్రదాయ ఉప్పు తయారీకి ఆదరణ లేదని, కావున రానున్న నూతన ప్రభుత్వం అయిన ఉప్పు కార్మికులను ఆదుకొనే విధం గా సాంప్రదాయ ఉప్పు తయారీని కుటీర పరిశ్రమ గా గుర్తించి దానికి పునర్ వైభవం తీసుకు రావడం తో పాటు ఆర్థికంగా తమను ఆదుకోవాలని ఉప్పు కార్మికులు కోరుతున్నారు.

Authorised
System Solution Provider for
VOLTAS
A TATA Enterprise
Md. Ibrahim Khaleel
M: 094402 11943
9 Planet Solutions
HVAC - VRF PROJECTS SALES & SERVICES
Our Services that will make you cool
Head Office
Plot No.P-58, Flat No.101, Taj Residency
Ashok Vihar Colony, Upparpally,
Hyderabad-500030, Telangana State,
E: 9planetsolutions2009@gmail.com
Branch Office
#13-2-18/4,Anthony Nagar,
Beside St.Anthony's High School,
Maharanipeta,Visakhapatnam-530002
Andhra Pradesh.




VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : T.Sirisha , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839
Hyderabad : Cell : 9030841841, Kakinada : Cell: 9949413661, Parawada : Cell: 77804 33919, Srikakulam : Cell: 70321 98574, Araku : Cell: 94401 84106,
VSP : 94937 77390, 7382585777. Arilova : 90149 11305 Maddilapalem : 99084 24231, Yelamanchili : 9441356676